14-04-2024
ఆదివారం
హైదరాబాద్

సంపుటి 26, సంచిక: 295
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00

Published from:
**Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం



మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

**• నివాళి**



**నేడు అంబేద్కర్ జయంతి**
జయంతి: 14 ఏప్రిల్, 1891
వర్ధంతి: 6 డిసెంబర్, 1956

## సిడ్నీ మాల్‌లో ఆరుగురి హత్య

**దుండగుడి కాల్చివేత**



**సిడ్నీ :** ఆస్ట్రేలియా నగరం సిడ్నీలోని ఒక షాపింగ్ మాల్‌లో ఒక వ్యక్తి ఆరుగురిని కత్తితో పొడిచి చంపాడు. తర్వాత అతడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ ఘటన సిడ్నీలోని బాండీ జంక్షన్ మాల్‌లో శనివారం నాడు జరిగింది. దుండగుడు జరిపిన దాడిలో తొమ్మిది నెలల బిడ్డ తరువాయి 2లో





# రాజ్యాంగంపై బిజెపి దాడి

**కానీ, మేము దానిని రక్షించాలనుకుంటున్నాం : రాహుల్‌గాంధీ**

**బస్తర్ :** వచ్చే లోక్‌సభ ఎన్నికలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే భావజాలానికి, వాటి ని ధ్వంసం చేసేందుకు ఉద్దేశించిన మరో భావజాలానికి మధ్య జరిగే పోరు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ (ఎస్‌టి) లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కవాసీ లఖ్మాకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రచార సభలో రాహుల్ మాట్లాడుతూ, దేశంలోని గిరిజన వర్గాల మతం, భావజాలం, చరిత్రపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణనను నిర్వహిస్తామని హామీని పునరుద్ఘాటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన మహిళ అయినందున అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపనకు హాజరయ్యేందుకు అనుమతించలేదని, ఇది కాషాయ పార్టీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'ఎన్నికలు వస్తున్నాయి, రెండు సిద్ధాంతాల మధ్య పోరు జరుగుతోంది. ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలనుకుంటున్న కాంగ్రెస్, ఇండియా కూటమి ఉండగా, మరోవైపు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న నరేంద్ర మోడీ, అదానీ, ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నారని అన్నారు. ప్రధాని మోడీ హయాంలో 70 కోట్ల మంది భారతీయుల సంపదకు సమానమైన సం పద కేవలం 22 మంది వ్యాపారవేత్తలు మాత్రమే పోగు చేసుకున్నారని అన్నారు. మోడీ 24 గంటలూ ఈ 22–25 మందికే మద్దతు పలుకుతారన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ఏ రాష్ట్రానికైనా వెళ్లి అతి పెద్ద సమస్యలు ఏవి అని అడిగితే, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం 'భాగిదారి' (అభివృద్ధిలో భాగస్వామ్యం లేకపోవడం) అని అందరూ చెబుతున్నారని, కానీ మీడియా మాత్రం వాటిని చూపించడం లేదని మండిపడ్డారు. మోడీని కొన్నిసార్లు విమానంలో ఎగురుతున్నట్లు, కొన్నిసార్లు సముద్రం కిందకు వెళుతున్నట్లు, తరువాయి 2లో

# గతంకంటే ఎక్కువే..

**తమిళనాడు, కేరళలో 'ఇండియా' ఘనవిజయం ఖాయం**

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం ధీమా**



**కోల్‌కత్తా :** కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికలకంటే ఈసారి ఎక్కువ స్థానాలు వస్తాయని, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.చిదంబరం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ, కర్నాటకలో ప్రజాదరణ కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, అక్కడ కూడా బలం పెరగుతుందన్నారు. హిందూత్వం లేదా హిందువులు ప్రమాదంలో లేరని, ప్రతిపక్ష పార్టీలన్నిటినీ హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరించి, మోడీని హిందూ రక్షకుడుగా చూపేందుకు బిజెపి వ్యూహాత్మకంగా అలా ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. కోల్‌కత్తా పర్యటనలో ఉన్న చిదంబరంను పిటిఐ ప్రతినిధి ఇంటర్వ్యూ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో కీలకమైన వ్యక్తి అని, ఆ రాష్ట్రంలో ఆమె తన బలాన్ని నిలుపుకోవడం ద్వారా ఇండియా కూటమి బలపడుతుందన్నారు. తాను అన్ని రాష్ట్రాల గురించి మాట్లాడబోనని, ఇండియా కూటమి తమిళనాడులో ఘన విజయం సాధించబోతున్నదని, కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ కూటములు మొత్తం 20 స్థానాలను పంచుకుంటాయే తప్ప అక్కడ బిజెపికి స్థానం ఇవ్వబోవని స్పష్టం చేశారు. కర్నాటక , తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాదరణ పొందుతున్నాయని, తమకు 2019 కంటే ఎక్కువ స్థానాలు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పుంజుకుంటున్నదని, హర్యానా, ఉత్తర్ ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాలలో సైతం ఇండియా కూటమికి అనుకూలంగా ప్రోత్సాహకరమైన సమాచారం అందుతున్నదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని , అవి హిందూ వ్యతిరేక పార్టీలని ప్రధాని మోడీ ఆరోపణలు చేయడం ద్వారా భారత్‌ను విడగొడుతున్నారని ఆరోపించారు. లేనిపోని భయాలను హిందువులు ఊహించుకోవాలని మోడీ కోరుతున్నారని అన్నారు. బుజ్జగింపు అనేది బిజెపి అవలంభిస్తున్న మైనారిటీ వ్యతిరేక వైఖరికి సంకేత నామమని చిదంబరం ఆరోపించారు. ఇది లోక్ సభో ఎన్నికల్లో బిజెపి వ్యూహాత్మకంగా ఎంచుకున్న వైఖరి అని తెలిపారు. 'కచ్చాతీవు' సమసిపోయి న అంశమని, కేవలం రాజకీయ, ఎన్నికల లబ్ధి కోసమే ఎన్నికల సమయంలో బిజెపి ఈ అం శాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే లేవనెత్తుతోందని విమర్శించారు. ఒకవైపు చైనా బలగాలు భారత భూభాగాన్ని ఆక్రమించుకుంటున్నాయని, సరహద్దును తమకు అనుగుణంగా చైనీయులు బలోపేతం చేసుఏకుంటున్నారనేది వాస్తవమని చెప్పారు. మోడీ, కేంద్ర మంత్రులు మాత్రం కచ్చాతీవు అంశాన్ని లేవనెత్తుతున్నారని, తద్వా రా శ్రీలంక దేశంలో పదుల లక్షల సంఖ్యలో నివసించే తమిళ భాష మాట్లాడే ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీలంక ప్రభుత్వం, తమిళులు లేదా సింహళీయులు, తమిళుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించబడుతుందని, అయినప్పటికీ ప్రధాని, కేంద్ర మంత్రులు మాత్రం సమసిపోయిన కచ్చాతీవు అంశాన్ని రాజకీయ, ఎన్నికల కారణాల కోసం లేవనెత్తుతుండడం విషాదకరమని, ఇది అత్యంత ఖండనార్హమైన విషయమని పేర్కొన్నారు.

## ఎఐ సవాళ్లను సమష్టిగా అధిగమించాలి

**ప్రపంచవ్యాప్తంగా ఉన్న న్యాయరంగ నిపుణులకు సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ సూచన**



**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధ (ఎఐ)తో వచ్చే సవాళ్ళను ప్రపంచవ్యాప్తంగా ఉన్న న్యాయరంగ నిపుణులు సమష్టిగా అధిగమించచాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. కృత్రిమ మేధ ఉపయోగించడం ద్వారా న్యాయరంగంలో నూతన పరివర్తన సాధించగలమని అన్నారు. 'భారత్–సింగపూర్ దేశాల సర్వోన్నత న్యాయస్థానాల మధ్య సాంకేతికత–చర్చలు' అనే అంశంపై రెండు రోజుల సదస్సులో జస్టిస్ చంద్రచూడ్ శనివారం మొదటిరోజు మాట్లాడారు. ప్రస్తుతం న్యాయస్థానాలు అనుసరిస్తున్న కేసుల పరిష్కార ప్రక్రియ సామర్థ్యాలను మెరుగుపరచేందుకు న్యాయ పరిశోధన, వివిధ కేసుల విశ్లేషణలను పెంచడంకోసం, న్యాయ రంగంలో న్యాయ వృత్తి చేసే నిపుణుల పనివిధానంలో బ్రహ్మాండమైన పరివర్తనకు కృత్రిమమేధ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. న్యాయస్థానంలో జరిగే కేసుల విచారణ, పరిష్కారాలలో కృత్రిమ మేధను ఆధునిక ప్రక్రియల ద్వారా సమీకృతం చేయడంలో వచ్చే సంక్లిష్టమైన నైతిక, న్యాయపరమైన ఆచరణాత్మక అంశాలను ప్రధానంగా పరిగణనకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కొత్త సాంకేతిక వ్యవస్థలో అత్యాధునిక ప్రక్రియగా రంగ ప్రవేశం చేసిన కృత్రిమ మేధ ద్వారా న్యాయవృత్తి నిపుణులకు కొత్తశక్తిసామర్థ్యాలు సమకూరతాయని, యావత్ న్యాయవ్యవస్థ ప్రక్రియలో అసాధారణమైన మార్పులకు, వేగానికి కృత్రిమ మేధ దోహదం చేస్తుందని అన్నారు. కృత్రిమ మేధ ద్వారా అసాధారణమైన అవకాశాలు ఉన్నాయని, తరువాయి 2లో



## కోటి ప్రభుత్వ ఉద్యోగాలు

**బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా**

**'పరివర్తన్ పత్ర' పేరుతో ఆర్‌జెడి ఎన్నికల మేనిఫెస్టో విడుదల**

**పాట్నా :** ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలతో 'పరివర్తన్ పత్ర' పేరుతో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఆ పార్టీ అగ్రనేత, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈసారి తాము 24 హామీలు ఇస్తున్నామని, వాటిని నిబద్ధతతో అమలు చేస్తామన్నారు. అంతేకాదు బీహార్ అభివృద్ధికి ఇవి చాలా ముఖ్యమన్నారు. ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పిస్తామని మ్యానిఫెస్టోలో తేజస్వి యాదవ్ తెలిపారు. మెరుగైన అనుసంధానికి బీహార్‌లో ఐదు కొత్త విమానాశ్రయాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో తరువాయి 2లో

## రూ. 500 సిలిండర్ సబ్సిడీకి నిధులు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్**

మహాలక్ష్మి ఎల్‌పిజి సబ్సిడీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 60 కోట్ల నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులను మంజూ రు చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహన్ శనివారం ఉత్తర్వలు జారీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.60 కోట్లను విడుదల చేసింది. కాగా ఈ నిధుల వినియోగానికి సంబంధించి వినియోగ సర్టిఫికెట్‌ను జత చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




# కేంద్ర సర్కార్ బెదిరిస్తోంది

**చేవెళ్ల సభలో బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఆగ్రహం**

**ప్రలోభాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శ**

**దళితబంధు లబ్ధిదారులతో కలిసి ధర్నా చేస్తానని వెల్లడి**



**ప్రజాపక్షం / రంగారెడ్డి ప్రతినిధి**

దర్యాప్తు సంస్థలను పంపించి కేంద్ర ప్రభుత్వం బెదిరిస్తోందని, ఇదేనా రాజకీయం అని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మోడీ లేదంటే ఇడి అన్నట్లుగా బిజెపి తీరు ఉందని ఆయన విమర్శించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో శనివారం జరిగిన బిఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి పదేళ్ల కాలంలో తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల రాలేదని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రాలేదని మండిపడ్డారు. ఒక్క కాలేజీ ఇవ్వని బిజెపికి రాష్ట్ర ప్రజలు ఎందుకు ఓటు వేయాలి? అని నిలదీశారు. పెట్రోల్, డీజిల్ సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేసిన వారు గతంలో బిఆర్‌ఎస్ పార్టీలోనే గెలిచారన్నారు. వారెవరో తెలియని సమయంలో మనం గెలిపించామన్నారు. వారు పార్టీ ఎందుకు మారారో చెప్పాలని నిలదీశారు. అధికారం, పదవి దేని కోసం బిఆర్‌ఎస్‌ను వదిలి పెట్టారో చెప్పాలన్నారు. బిజెపి పాలనలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదని విమర్శించారు. తెలంగాణలో మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ తన మెడపై కత్తి పెట్టినా మనం తగ్గలేదన్నారు. ఇప్పుడు మీటర్లు రావొద్దంటే బిజెపిని ఓడించాలని తరువాయి 2లో

# కేసులు ఎత్తేస్తేనే కొనుగోళ్లు

**తేల్చి చెప్పిన వ్యాపారులు**

**జనగామ మార్కెట్‌లో నిలిచిన విక్రయాలు**

**ప్రజాపక్షం/ జనగామ ప్రతినిధి**



రబీ రైతులు అయోమయానికి గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదు. మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి వ్యాపారులు నిరాకరిస్తున్నారు. తమపై పెట్టిన కేసులు ఎత్తేస్తేనే కొనుగోళ్ల విషయం ఆలోచిస్తామని తేల్చి చెప్పారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించడంతో వ్యాపారులంతా ఒక్కటై జనగామ మార్కెట్‌లో అన్ని సరుకుల కొనుగోళ్లను పూర్తిగా నిరాకరించారు. దీంతో అధికారులు సైతం అయోమయానికి గురవుతున్నారు. సివిల్ సప్లయీస్, పిఎసిఎస్ కేంద్రాలు ప్రారంభించినా నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో కళ్లాల్లో ధాన్యం పోసిన రైతులకు ఏం చేయాలో పాలుపోక అయోమయానికి గురవుతున్నారు. జనగామలో గతేడాది మాదిరిగానే వరి పంట విరివిరిగా సాగు చేశారు. భూగర్భ జలాలు పడిపోవడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుమారు 50వేల ఎకరాలకు పైగా ఎండిపోయింది. అయితే జిల్లాలో 179 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అధిక శాతం మంది రైతులు వాతావరణం చల్లబడి వర్షాలు కురిసే అవకాశాలు ఉండంతో ఆరబెట్టకుండా మార్కెట్‌కు తెస్తున్నారు. తేమ 20–25 శాతానికి పైగా ఉంటుంది. దీనితో వ్యాపారులు పూర్తిగా ధరలు తెగ్గోసి కొనుగోలు చేస్తున్నారు. గత మంగళవారం ఒక రైతు తెచ్చిన ధాన్యానికి రూ. 1526 ధర నిర్ణయించారు. ఇలా అనేక మంది రైతుల పంటలకు తక్కువ ధర ఇస్తుండడంతో తరువాయి 2లో

## సక్రమంగా ధాన్యం సేకరణ

**కనీస మద్దతు ధరలకంటే తక్కువ ధరలకు అమ్ముకోవద్దు : డి.ఎస్ చౌహాన్**




**ప్రజాపక్షం/హైదరాబాద్**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ సక్రమంగానే సాగుతోందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరలు చెల్లిస్తున్న నేపథ్యంలో రైతులెవ్వరూ కనీస మద్దతు ధరలకంటే తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సూచించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన రెండు రోజుల్లోనే రైతు బ్యాంకుల ఖాతాలలో నగదును చెల్లిస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ అంశంపైన తరువాయి 2లో




# బిజెపి గద్దె దిగితేనే...

**భారత లౌకిక వ్యవస్థకు మనుగడ**

**సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ సదస్సులో వామపక్షాల నేతల పిలుపు**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి**

కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం గద్దె దిగితేనే భారత లౌకిక వ్యవస్థకు మనుగడ సాధ్యమని వామపక్షనేతలు స్పష్టం చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై వామపక్ష నేతలు బి.బాలకిషన్, ఎ.రాములు, సి.వెంకటేశ్ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ తరువాయి 2లో

# ఇజ్రాయిల్‌కు మద్దతుగా రంగంలోకి అమెరికా

## అమెరికా నుండి రక్షణకు చైనా, రష్యా మద్దతు కోరిన కిమ్ జోంగ్



**సియోల్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అమెరికా నుండి తమకు రక్షణ ఇవ్వాలని, స్నేహ, సహకారాలు అందించాలని చైనా, రష్యాలకు ఉత్తర కొరియా విజ్ఞప్తి చేసింది. చైనా ప్రభుత్వంలో ఉన్నతస్థాయి ప్రజా ప్రతినిధి ఝావో లిఝి శనివారంనాడు ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో సమావేశమయ్యారు. మూడు రోజులపాటు ఆన ఆ దేశంలో పర్యటించారు. కాగా రష్యాకు చెందిన నాయకులు కూడా ఆ దేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ దేశానికి పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని కిమ్ జోంగ్ వారికి విజ్ఞప్తి చేశారు. అమెరికా నుండి తమకు బెదిరింపులు పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో అండగా ఉండాలని ఆయన కోరారు. ఉత్తర కొరియాతో లోతైన సంబంధాలు, సహకారం అభివృద్ధి చేసుకోవడానికి రెండు దేశాల నాయకులు అంగీకరించారని చైనా మీడియా శనివారంనాడు తెలియజేసింది. 2018 తర్వాత ఉత్తర కొరియాలో చైనాకు చెందిన అత్యున్నతస్థాయి ప్రభుత్వ అధినేత పర్యటించడం మళ్ళీ ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా అంతర్జాతీయ పరిస్థితులు, ప్రాంతీయ ఉద్రిక్తతలు, ఉత్తర కొరియా అభివృద్ధికి చేయూత వంటి అనేక అంశాలపై నాయకులు ఇద్దరూ చర్చించారు. స్నేహ, సహకారాలను చైనా, రష్యా రెండు దేశాలతో అభివృద్ధి చేసుకునేందుకు ఉత్తర కొరియా కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కిమ్ జోంగ్ చెప్పారు.

## జింబాబ్వేలో తీవ్ర కరువు పరిస్థితులు

**హరారే :** జింబాబ్వేలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకున్నాయి. ఆ దేశ ప్రభుత్వం ఈ విషయం ప్రకటించింది. దేశాన్ని కరువుదేశంగా, ప్రకృతి విలయంలో చిక్కుకున్న దేశంగా పేర్కొంది. దక్షిణ ఆఫ్రికాలో ఇటీవల ప్రధానంగా కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. తక్షణం రెండు బిలియన్ డాలర్లు మానవతా సహాయం దేశానికి కావాలని ప్రపంచ సంస్థలకు జింబాబ్వే దేశాధ్యక్షుడు ఎమ్మర్సన్ మ్నాన్‌గాగ్వా విజ్ఞప్తి చేశారు. ఐతే ఇప్పటికే ఐక్యరాజ్యసమితి 27 లక్షలమంది కరువు ప్రాంత ప్రజలకు జింబాబ్వేలో ఆహార సరఫరా పథకాన్ని ప్రారంభించింది. గడచిన జనవరి నుండి జింబాబ్వేలో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. గడచిన దశాబ్దాలలో ఎన్నడూలేనంత తీవ్ర కరువు పరిస్థితులు ఆ దేశంలో ఏర్పడ్డాయని వాతావరణ పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. జింబాబ్వేలో ఉన్న జనాభాల్లో 60 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తారు. అదేవిధంగా సూడాన్‌లో కూడా గత ఏడాది చివరాఖరు నుండి తీవ్ర కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. జింబాబ్వే, సూడాన్‌లలో కరువు పరిస్థితులకు వాతావరణ మార్పులే ప్రధాన కారణమని ఐక్యరాజ్యసమితి వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే 24 నెలలు భూగోళ వాతావరణ రక్షణకు అత్యంత కీలకమై సమయమని పేర్కొంది.

### 'డోంట్' అంటూ ఇరాన్‌కు ఏకవాక్య సందేశం
### పశ్చిమాసియాలో బలగాలు పెంచిన పెంటగాన్
### బంగారం, పెట్రోలు ధరల పెరుగుదల



**ప్రపంచం**

**వాషింగ్టన్ :** ఏ క్షణమైనా ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడులు చేయడానికి సిద్ధంగా ఉండటంతో అమెరికా రంగంలోకి దిగింది. ఇరాన్ దాడుల నుండి ఇజ్రాయిల్‌కు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఇజ్రాయిల్ రక్షణకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. అదేసమయంలో ఇజ్రాయిల్‌కు దూరంగా ఉండాలని ఇరాన్ మరోసారి అమెరికాకు హెచ్చరిక చేసింది. ఐతే బైడెన్ కూడా ఇరాన్‌కు ఏక వాక్య సందేశం పంపించారు. "డోంట్" అంటూ ఇరాన్ ప్రభుత్వానికి సందేశం పంపారు. ఇరాన్‌పై దాడి చేయవద్దని ఆయన ఆ ఏక వాక్య సందేశంలో కోరారు. పశ్చిమ ఆసియా అంతటా ఈ దాడుల విషయంపై తీవ్ర ఉద్రిక్తత, ఉత్కంఠ ఏర్పడంలో "ఇదగో...దాడి!...అదిగో దాడి..!" అని పలుచోట్ల వందతులు వస్తున్నాయి. ఇరాన్ దాడి చేస్తే పూర్తి స్థాయిలో పెద్ద యుద్ధంగా ఆది రూపాతర చెందుతుందన్న ఆలోచనలతో ప్రపంచ దేశాలన్నీ పశ్చిమ ఆసియా పరిణామాలవైపే చూస్తున్నాయి. రాబోయే 48 గంటల్లో ఇరాన్ ఏ క్షణంలోనైనా దాడులు చేయవచ్చునని వాషింగ్టన్ వర్గాలు అంచనావేశాయి. దీంతో పశ్చిమ ఆసియాలో అమెరికా అదనపు బలగాలను మోహరించింది. పశ్చిమ ఆసియా జలాల్లో రెండు డెస్ట్రాయర్ నౌకలను మోహరించింది. మరింత యుద్ధ సామాగ్రిని తరలిస్తున్నది. అదేవిధంగా ఇరాన్ కదలికలను చాలా నిశితంగా పరిశీలిస్తున్నది. మరోవైపు ఇజ్రాయిల్ కూడా అసాధాణ దాడులకు సన్నద్ధమవుతున్నది. ఇజ్రాయిల్ దాడి గనుక చేస్తే తాము కూడా ప్రత్యక్ష దాడులకు దిగుతామని ఇజ్రాయిల్ రక్షణమంత్రి యోవ్ గాలెంట్ హెచ్చరించారు. స్వీయ రక్షణ చర్యలతో తాము సిద్ధంగా ఉన్నామని, పదాతి, వాయు సేనలు సన్నద్ధగా ఉన్నాయని ఆయన చెప్పారు.దీంతో పశ్చిమ ఆసియాలో పరిస్థితులు మరింత ఉద్ధృత రూపం దాల్చాయి. భారత్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు తమ ప్రజలకు ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలకు వెళ్ళవద్దని ఆదేశాలు జారీ చేయగా నెదర్లాండ్స్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌లో ఉన్న దౌత్య కార్యాలయాన్ని మూసివేసింది. తిరిగి దౌత్య కార్యాలయాన్ని ఎప్పుడు తెరవాలనే విషయంపై సోమ, మంగళవారాల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. పశ్చిమ ఆసియాలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులతో ప్రపంచ మార్కెట్‌లో బంగారం, చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోలు ధర ఒక బ్యారెల్‌కు 90 డాలర్లకు పెరిగింది. కాగా జోర్డాన్‌లో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్రజలు వేలాదిమంది రోడ్లమీదకు వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఇజ్రాయిల్‌దేశంతో దౌత్య సంబంధాలు రద్దు చేసుకోవాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. పాలస్తినాకు అనుకూలంగా నినాదాలు చేశారు.

### సందిగ్ధంలో పడిన ఇరాన్!

సిరియా దౌత్యకార్యాలయంపై దాడుల్లో ఏడుగురు ఇరాన్ కమాండర్లు, సైనిక అధికారులు మరణించడంతో ఆ దేశం ప్రతీకారజ్వాలతో రగిలిపోతోంది. ఐతే ఇజ్రాయిల్‌పై తొందరపడి దాడి చేస్తే అది పూర్తిస్థాయి యుద్ధంగా మారితే ఆ పరిణామాలను స్వీకరించడానికి కూడా సిద్దంగా ఉండాలన్న అనిశ్చితిలో ఇరాన్ ఉంది. "ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడి చేయడం పక్కా...కానీ భారీస్థాయిలో దాడిచేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి, దాడి చేయకపోతే ఇరాన్ ప్రజలు తీవ్ర అవమానభారంతో కుమిలిపోతారు అని ఇరాన్ సర్వాధికారి ఆయెతుల్లా ఖొమైనీ సందిగ్ధంలో ఉన్నారు" అని దోహా లోని ఇనిస్టిట్యూట్ ఫర్ గ్రాడ్యుయేట్ స్టడీస్ అధ్యయనం వెల్లడిచింది. ఈ సంస్థ ప్రతినిధి మహ్మద్ ఎల్మస్‌రై మాట్లాడుతూ, దాడి చేస్తే ఇరాన్ ప్రతిదాడులను ఇరాన్ ఎదుర్కోవాలనీ, ఇది ఎంత వరకూ వెళుతుందనే విషయంలో ఖొమైనీకి చాలా సందేహాలున్నాయని అన్నారు. ఇది చేయిజారి అతిపెద్ద యుద్ధంగా మారకుండా ఉండాలంటే అగ్రదేశాలు విజ్ఞప్తులు చేస్తున్నట్లుగా స్వల్పస్థాయి దాడులతో సరిపెట్టడం ఒక్కటే మార్గమని, దా మధ్యవర్తి ముఠాలకు ఇజ్రాయిల్‌పై దాడుల యుద్ధం కొనసాగించే బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచనలు సాగుతున్నాయి. ఇదే ఇప్పుడు ఇరాన్‌కు అతిపెద్ద కీలక సమస్యగా మారిందని అధ్యయనం పేర్కొంది. మరోవైపు వైట్‌హౌస్–ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం రహస్యంగా జరుగుతోందనీ, స్వల్పదాడులతో వివాదాన్ని కట్టిపెట్టాలని అమెరికా సలహా ఇస్తున్నదనీ కూడా అధ్యయనంపేర్కొంది.

### హిజ్బుల్లా రాకెట్ దాడులు

ఇజ్రాయిల్‌ను మొదటినుండీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ దక్షిణ లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న హిజ్బుల్లా ఉగ్రవాదులు శుక్ర, శనివారాలనాడు ఉత్తర ఇజ్రాయిల్ ప్రాంతంలో రాకెట్ దాడులు చేశారు. సుమారు 50 రాకెట్లు ప్రయోగించారు. ఐతే ఇజ్రాయిల్ కూడా ఇందుకు ప్రతిగా ఈక్విల్మ్ అల్ టఫ్ ప్రాంతంలో ప్రతిదాడి చేసింది. తమ భూభాగంలోకి 40 రాకెట్లు ప్రయోగించారని, ఎక్కువ రాకెట్లు ఖాళీ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయిల్ రక్షణశాఖ ప్రకటించింది. ఈ దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లో ప్రజలు గ్రామాలు వదిలి పారిపోయారు. ఇంకోవైపు గాజా సిటీలో శుక్రవారం ఇజ్రాయిల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఐదురుగురు పౌరులు మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు.

### వెస్ట్‌బ్యాంక్‌లో సెట్లర్స్ దాడులు: ఒకరు మృతి



వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతాలలో సెటిలర్స్ పాలస్తినా ప్రజలపై దాడులు చేస్తున్నారు. ఒక టీనేజ్ బాలిక కనిపించడంలేదన్న వార్తలు రావడంతో ఈ దాడులు మరింత పెరిగాయి. వెస్ట్‌బ్యాంక్‌లో ఈ కారణంగా శనివారం కూడా హింసాకాండ కొనసాగింది. వారు కార్లు ధ్వంసం చేశారు. పాలస్తీనియన్లపై రాళ్ళు రువ్వారు. ఈ దాడిలో ఒకరు మరణించగా డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు గాయపడ్డారు. రమల్లా నగ ర సమీపం నుండి బెంజిమిన్ అచిమైర్ అనే 14 ఏళ్ళ బాలుడు శుక్రవారం ఉదయం అదృశ్యం కావడంతో సెట్‌లర్లు దాడులు ప్రారంభించారు. సైన్యం అతడి కోసం గాలిస్తోంది. గత ఏడాది అక్టోబరు నుండి వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో సెట్‌లర్స్ దాడులు అనూహ్యంగా పెరిగాయి. ఇప్పటివరకూ 700కు పైగా దాడులు జరిగాయిన ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ దాడుల కారణంగా 1,200 మంది ఇళ్ళు వదిలి పారిపోయారు.

## పాకిస్థాన్ హైవేలో 11 మంది ప్రయాణికులు కాల్చివేత

**లాహోర్ :** పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రంలో క్వెట్టా–టఫ్‌టాన్ జాతీయ రహదారిపై శనివారంనాడు జరిగిన రెండు వేరు వేరు ఘటనల్లో 11 మంది ప్రయాణికులను సాయుధ దుండగులు కాల్చి చంపారు. శనివారం తెల్లవారు ఝామున హై వే పై వెళుతున్నఒక బస్సునుండి తొమ్మిదిమంది ప్రయాణికులను సాయుధులు కిడ్నాప్ చేసి హతమార్చారు. నాష్కి–బలూచిస్థాన్ సమీపంలోని సుల్తాన్ చెర్వాయ్ వద్ద ఈ ఘటన జరిగిందని డిసిపి హబీబుల్లా ముషాఖెల్ చెప్పారు. సుమారు 12 మంది సాయుధులు బస్సును అడ్డగించి ప్రయాణికులందరినీ కిందకు దించారు. వారిని గుర్తింపు కార్డులను పరిశీలించి తొమ్మిదిమందిని ఎంపిక చేసి వారిని కిడ్నాప్ చేశారు. అనంతరం వారిని కాల్చి చంపారు. ఐతేవీరు మైనారిటీ మతస్తులా, ఇతర దేశీయులా? అనే విషయాలు వెల్లడి కాలేదు. కిడ్నాప్ ఘటన జరిగిన గంటన్నర తర్వాత ఒక వంతెన కిందిభాగంలో ఈ తొమ్మిదిమంది ప్రయాణికుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ పోలీస్ కమీషనర్ ముషాఖెల్ చెప్పారు. ఈ మృతులను వజీరాబాద్, మండీ, గుజ్రాన్‌వాలాలకు చెందినవారుగా తర్వాత గుర్తించారు. మరో ఘటనలో ఇదే హైవేపై వెళుతున్న ఒక వాహనాన్ని తుపాకులు ధరించిన వ్యక్తులు అడ్డుకున్నారు. కానీ ఆ వాహనం ఆగకపోవడంతో కాల్పులు జరిపారు. దాంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించారు.

## నేపాల్‌లో నూతన సంవత్సర వేడుకలు



**కట్మండు :** నేపాల్ దేశ ప్రజలు శనివారంనాడు నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహవంతమైన వాతావరణం మధ్య ఘనంగా చేసుకున్నారు. సంప్రదాయబద్ధమైన బిక్రమ్ సంబత్ 2081 సంవత్సరం (విక్రమ నామ సంవత్సరం) ఆగమన వేడుకలు నిర్వహించారు. నేపాల్‌లో రాచరిక పరిపాలన ముగిసేవరకూ ఆ దేశం ప్రపంచంలో ఏకైక హిందూ దేశంగా ఉండేది. తర్వాత ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించింది. ప్రజలు ప్రధానంగా దేవాలయాలను సదర్శించి పర్వదినం చేసుకున్నారు. గ్రామాలు, పట్టణాలను అందమైన తోరణాలతో సంప్రదాయబద్ధంగా అలంకరించారు. నేపాల్ సంప్రదాయం ప్రకారం భారతదేశ చక్రవర్తి విక్రమాదిత్య పేరుతో ఉన్న శకంలో ఈ కొత్త సంవత్సరం ప్రవేశించింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పశుపతినాథ ఆలయంతోపాటు నేపాల్ వ్యాప్తంగా ఉన్న అన్నే చారిత్రక, పురాతన ఆలయాలన్నీ వేలాదిమంది భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. "దేశీయ ఉత్పత్తిని పెంచి దేశ పారిశ్రామికాభివృద్ధికి ఆర్థికవ్యవస్థ సుస్థిరత సాధనకు తమ ప్రభుత్వం పాటుపడుతోందని పౌడెల్ తన సందేశంలో పేర్కొన్నారు.

## ఆరుగురి హత్య
(మొదటి పేజీ తరువాయి)

కత్తిపోట్లకు తీవ్రంగా గాయపడింది. వెస్ట్‌ఫీల్డ్ షాపింగ్ సెంటర్‌లో ఒకవ్యక్తి ఆకస్మికంగా మాల్‌లో కొనుగోళ్ళు చేస్తున్న వినియోగదారులపై కత్తితో దాడి ప్రారంభించాడు. తరాత పోలీసు ఇన్‌స్పెక్టర్ అతడిని కాల్చి చంపారని న్యూ సౌత్ వేల్స్ అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ ఆంథోనీ కూక్ పాత్రికేయులకు చెప్పారు. మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు. ఈ దాడిలో మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వారికి ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన తొమ్మిదినెలల పసిబిడ్డకు సర్జరీ చేస్తున్నారు. విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలు ఆచూకీ తీస్తున్నారు. ఘటన అనంతరం వైద్యులు, అంబులెన్సులు పెద్ద సంఖ్యలో షాపింగ్ మాల్ వద్దకు వచ్చి బాధితులకు అక్కడే ప్రాథమిక చికిత్సలు చేశాక ఆసుపత్రులకు తరలించారు.

## రాజ్యాంగంపై బిజెపి దాడి
(మొదటి పేజీ తరువాయి)

కొన్నిసార్లు ఆలయంలో పూజలు చేస్తున్నట్లు చూపిస్తున్నదన్నారు. గిరిజనులను వర్ణించడానికి ఉపయోగించే 'ఆదివాసీ' (స్థానిక ప్రజలు) అనే పదాన్ని మార్చేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'మేము మిమ్మల్ని ఆదివాసీ అని పిలుస్తాము, కానీ వారు 'వనవాసీ' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. దానికి, దీనికి చాలా తేడా ఉంది....'ఆదివాసి' అనే పదానికి లోతైన అర్థం ఉంది. 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి)పై మీ హక్కులను ఈ పదం వ్యక్తపరుస్తుంది, అయితే 'వనవాసి' అంటే అడవిలో నివసించే వారు' అని ఆయన అన్నారు. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు పంచాయితీ (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం (పిఇఎస్‌ఎ, నరేగా పథకాలు తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ గిరిజనుల కోసం పనిచేస్తే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం గిరిజనుల మతం, భావజాలం, భాష, చరిత్రపై దాడి చేసాస్తున్నాయన్నారు. 'దేశంలో అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది.. అదానీ లాంటి కోటీశ్వరులకు బిజెపి అటవీ భూమిని ఇస్తోంది.. భారతదేశంలో అడవులు ఉండని రోజు వస్తుందని, అప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మిమ్మల్ని అడవివాసి అని పేర్కొంటాయి' అని అన్నారు. కాగా, ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన నిర్వహిస్తామని చెప్పారు. 'ఖాళీగా ఉన్న 30 లక్షల ప్రభుత్వ పోస్టులకు రిక్రూట్‌మెంట్ చేపడతాం, అధికారంలోకి వస్తే యువతకు అప్రెంటీస్‌షిప్‌లు ప్రారంభిస్తాం. ఉద్యోగం రాకముందే యువతకు అప్రెంటీస్‌షిప్ హక్కు కల్పిస్తామన్నారు.

## కోటి ప్రభుత్వ ఉద్యోగాలు
(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఆగస్టు 15నుంచి ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. రక్షాబంధన్ రోజు పేద సోదరిమణులకు ఏటా లక్ష రూపాయలు ఇస్తామని తేజస్వీయాదవ్ హామీ ఇచ్చారు. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు చెప్పారు. బీహార్‌లో పాత పింఛన్ పథకాన్ని అమలుచేస్తామన్నారు. ప్రధాని మోదీ సమస్యలను పట్టించుకోకుండా ప్రజల దృష్టిని మరల్చడానికి ఇతర విషయాలపై మాట్లాడుతున్నారని తేజస్వీ మండిపడ్డారు.

**'నేరవేర్చిన హామీలు చెప్పాలి' :** 'మేము ఏం చెబితే అదే చేస్తాం. బీహార్‌లో ఏం చెప్పామో అదే చేశాం. రిజర్వేషన్ పరిమితులు పెంచాం. కుల గణన చేశాం. నితీశ్ కుమార్ ప్రస్తుతం బిజెపితో కలిసి పోటీ చేస్తున్నారు. నేను ఆయన్ను గౌరవిస్తాను. ఇప్పుడు ప్రధాని, సిఎం ఎందుకు మాట్లాడటం లేదు? బీహార్‌కు ప్రధాని నెరవేర్చిన ఒక్క హామీ అయినా ఉందేమో చెప్పాలి. మేము బీహార్‌కు ప్రత్యేక హోదా కావాలని అడుగుతున్నాం' అని తేజస్వీ యాదవ్ మాట్లాడారు. బీహార్‌కు మొత్తం ఏడు దశల్లో 40 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొదటి దశలో నాలుగు స్థానాల్లో, రెండు నుంచి ఐదు దశల వరకు ఒక్కొక్కసారి 5 స్థానాలకు, 6,7 దశల్లో 8 స్థానాలుకు ఎన్నికలు జరగనున్నాయి.

## జనగామ మాజీ ఎంఎల్‌ఎ ముత్తిరెడ్డిపై భూ వివాదం కేసు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ మాజీ ఎంఎల్‌ఏ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై భూవివాధం కేసు నమోదైంది. మండలంలోని చీటకోడూరు గ్రామానికి చెందిన గాడిపెల్లి రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైందని సిఐ తిరుపతిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్‌రెడ్డి స్వగ్రామమైన చీటకోడూరులో సర్వే నెం. 214లో 5 ఎకరాల 24 గుంటల వ్యవసాయ భూమి ఉందన్నా రు. అదే గ్రామంలో సర్వే నెం. 39లో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 3ఎకరాల 11 గుంటల భూమి భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి దగ్గర కొనుగోలు చేశాడన్నారు. దారి కోసం రాజేందర్‌రెడ్డి వ్యవసాయ భూమి నుండి అక్రమంగా మట్టిపోసి బాటచేయడంతో పాటు చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. కొందరి ప్రోద్బలంతో రాజేందర్ రెడ్డి విదేశాలకు వెళ్లకుండా తన పాస్‌పోర్ట్‌ను నిలిపివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ఈ విషయమై ఎసిపి సమక్షంలో విచారించి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, భూరెడ్డి ప్రమోద్‌రెడ్డిపై సెక్షన్ 427, 447, 506 కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## సక్రమంగా ధాన్యం సేకరణ
(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని పౌర సరఫరాల భవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో చౌహన్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధాన్యం సేకరణ ఆరోగ్యకరమైన వాతావరణంలో సాగుతుందని, రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తుకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి రోజూ జిల్లాల వారీగా అన్ని గ్రామాల్లో ధాన్యం సేకరణపై తాము సమీక్షిస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లకు అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించిన పౌరసరఫరాల శాఖ, ఇప్పటి వరకు 6919 కేంద్రాలను తెరచి,సరకు సేకరిస్తుందని స్పష్టం చేశారు. పల్లెల్లో దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు వడ్లు అమ్ముకోవాలని సూచించారు. ఎఫ్‌సిఐ నిబంధనలు ప్రకారం 17 శాతం తేమ ఉన్న వడ్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులకు తీసుకురావాలని, కొన్ని చోట్ల 50 శాతం పైగా తేమ వస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా 56 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మన రాష్ట్రం నుంచి బయటకు పోయినా సమస్య లేదని, కానీ బయట నుంచి రావొద్దన్నారు. రైస్ మిల్లర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీ బాయి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బిజెపి గద్దె దిగితేనే...
(మొదటి పేజీ తరువాయి)

సదస్సుకు ముఖ్య అతిథిగా హజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేశ్, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్‌చందర్ మాట్లాడుతూ దేశంలో గత పది సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న బిజెపి ఏనాడూ పేదల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోకుండా ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేస్తూ దేశంలో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. నరేంద్రమోడీ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ అంబానీ, అదానీలకు ఒక్కొక్కటిగా కారుచౌకగా అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పాలనకు దాసోహమైన నరేంద్ర మోడీ... ఇప్పటికే దేశాన్ని అన్ని విధాలుగా నాశనం చేశారని విమర్శించారు. మూడోసారి కూడా తానే అధికారంలోకి వస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఇడి, సిబిఐ ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బాధితులు బిజెపిలో చేరితే వారిపై దాడులు ఆపేస్తున్నారని, చేరని వ్యక్తులను జైలుకు పంపుతూ నీచ రాజకీయాలు చేస్తున్నార ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా ఎన్నికల సమయంలో తాము చేసిన అభివృద్ధి చెప్పుకుని ఓట్లు అడుగుతారని కానీ, నరేంద్రమోడీ మాత్రం వ్యక్తిగత విషయాలైన కులం, మతానికి ఆజ్యం పోస్తూ రాముడి పేరు చెబుతూ ఓట్లు అడగడం సిగ్గుచేటు అన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగానే బిజెపి నేతలు చెప్పడం చాలా విడ్డూరమని వాపోయారు. బిజెపి ప్రభు త్వం అబద్ధాలతో సోషల్ మీడియాలో ప్రజలను అయోమయానికి గురి చేసే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. దేశంలో బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద, ప్రజా వ్యతిరేక బిజెపి పార్టీని తిరిగి అధికారంలోకి రాకుండా ప్రజాస్వామ్యవాదులు మేధావులు ప్రగతిశీల పార్టీలు ఏకమై అడ్డుకోవాలన్నా రు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రాములు, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నేత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కేసులు ఎత్తేస్తేనే కొనుగోళ్లు
(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన జరిగింది. దీనితో అదనపు కలెక్టర్ పరిశీలించి మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు ముగ్గురు వ్యాపారులపై కేసులు పెట్టారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనితో వ్యాపారులు పూర్తిగా కొనుగోళ్లు నిలిపివేశారు. అధికారులు వెంటనే పిఎసిఎస్, ఐకెపి సెంటర్లను ప్రారంభించారు. కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేస్తుండగా వరుస సెలవుల నేపధ్యంలో నాలుగు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయి.

**కొనుగోళ్లకు వ్యాపారుల నిరాకరణ**

శనివారం మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ జనగామలోని వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వయించారు. మార్కెట్‌కు వచ్చే ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. దీనికి వారు నిరాకరించారు. ధాన్యం కొనుగోలు చేయకుంటే మిగతా సరుకులైనా కొనుగోలు చేయాలని కోరగా వాటిని కూడా కొనుగోలు చేయలేమని చెప్పారు. అయితే చర్యలు ఉంటాయని హెచ్చరించడంతో సాయంత్రం వరకు ఆలోచించి చెబుతామని వెళ్లిపోయారు. తరువాత జాయింట్ కలెక్టర్ రోహిత్ సింగ్ కలెక్టరేట్‌లో వ్యాపారులు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడ కూడా కొలిక్కి రాలేదు. తేమ అధికంగా ఉన్న ధాన్యానికి మద్దతు ధర ఎలా పెడతామని చెప్పడంతో పాటు తేమ, నాణ్యత నిబంధనలు పాటించినా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తే తమకేం లాభం అంటు వ్యాపారుల మొండికేసిన పరిస్థితి. ఈ పరిస్థితిలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

**కేసులు ఎత్తేయాలని డిమాండ్**

మంగళవారం జరిగిన సంఘటనకు కారణకులైన వారిపై అదనపు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదనపు కలెక్టర్ నిర్ణయాన్ని అభినందించారు. ఎక్కడైనా రైతుల్ని మోసం చేయాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే జనగామ మార్కెట్ వ్యాపారులు మాత్రం తమపై కేసులు ఎత్తేస్తేనే కొనుగోళ్లు జరుపుతామని తేల్చిచెప్పిన పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకుంటే కిరాణం షాపులైనా పెట్టుకొని బతుకుతాం తప్ప కొనుగోళ్లు జరపమని మొండికేస్తున్నారు.

**కొనుగోళ్లకు కోతలకు పాల్పడితే కఠిన చర్యలు : అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్**

ధాన్యం కొనుగోళ్లలో కోతలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తేల్చి చెప్పారు. శనివారం రైస్ మిల్లర్లు, కొనుగోలుదారులు, లారీ కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలన్నారు. ఎలాంటి కోతలకు పాల్పడినా..వసతులు కల్పించకపోయినా చర్యలు ఉంటాయన్నారు. వ్యాపారులు సైతం రైతుకు మద్దతు ధర ఇవ్వాలని, ధర, తూకాల్లో కోతలు పెట్టొద్దన్నారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే షిఫ్టింగ్ చేయాన్నారు.

## సమష్టిగా అధిగమించాలి
(మొదటి పేజీ తరువాయి)

అదే సమయంలో ఇది అత్యంత సంక్లిష్టమైన సమస్యలను, సవాళ్ళనుకూడా లేవనెత్తుతుందని, ప్రత్యేకించి నైతిక ప్రామాణికతలు, జవాబుదారీతనం, పక్షపాత ధోరణి వంటి అంశాల విషయంలో సవాళ్ళు ఎదురవుతాయని, ప్రపంచ వ్యాప్తంగా సంబంధిత న్యాయ రంగంలో వచ్చే ఈ సవాళ్ళను ప్రపంచవ్యాప్తంగా నిపుణులు అందరూ సమష్టి కృషితో అధిగమించాల్సిన అవసరం ఉంటుందని జస్టిస్ చంద్రచూడ్ హితవు చెప్పారు.ఈ విషయంలో భౌగోళిక, ప్రాదేశిక అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అత్యాధునికత సాధనకు, నవీనీకరణలకు కృత్రిమ మేధను ఒక సరికొత్త సరిహద్దుగా ఆయన అభివర్ణించారు. దీని ద్వారా అపారమైన అవకాశాలతోపాటు అత్యంత సంక్లిష్టమైన సవాళ్ళు కూడా ఎదురవుతాయని, వీటిపైనే నిపుణులు చర్చలు జరపాలని అన్నారు. చాట్ జిపిటి ఆవిష్కరణతో అసలు కృత్రిమ మేధపై ఆధారపడాలా? వద్దా? అనే విషయంపై పెద్ద చర్చ ప్రారంభమైందనీ, కేసుల పరిష్కారంలో దీని ద్వారా ఒక తుది నిర్ణయానికి రావాలా? వద్దా? అనే విషయంపైన కూడా ఈ చర్చ జరుగుతోందన్నారు. ఐతే ఈ విధమైన వాటిద్వారా మనం కృత్రిమ మేధను ఉపయోగించకుండా దూరంగా పెట్టలేమని కూడా ఆయన అన్నారు. నైతిక, న్యాయపరమైన, ఆచరణాత్మక అంశాల పరిశీలనకు ఆధునిక ప్రక్రియల్లో కృత్రిమ మేధను సమీకృతం చేయాల్సిన అవసర ఉందన్నారు. మొహాన్ని గుర్తించడం ద్వారా విశ్వసనీయమైన సాంకేతిక సేవలు అందించే ప్రక్రియతో చాలా పెద్ద సమస్య ఉందని అన్నారు. ఈ విధమైన ఫేసియల్ రికగ్నిజేషన్ విధానం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. సింగపూర్‌కు చెందిన సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ మీనన్‌తోపాటు పలువురు ప్రముఖులు, న్యాయ నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## కేంద్ర సర్కార్ బెదిరిస్తోంది
(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు స్కూటీలు కొనిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు లూటీలు మొదలు పెట్టిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అన్ని పంటలను కొనుగోలు చేస్తామని చెప్పిందని, కానీ కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. పంటకు బోనస్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రలోభాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అంబేద్కర్ ముందుచూపు కారణంగానే తెలంగాణ సాకారమైందని కెసిఆర్ అన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3 వల్ల తెలంగాణ వచ్చిందన్నారు. అందుకే రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు.

**కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి :** కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలపై గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులకు డిపాజిట్లు రాకుండా ఓడించాలని కెసిఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలకు మంచి జరిగేలా బతికున్నంత వరకు పోరాడుతూనే ఉంటానని, బిఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోగానే కరెంటు, సాగునీరు, తాగునీరు లేకుండా పోయాయని కెసిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు నెరవేరాలంటే బిఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. బలమైన ప్రతిపక్షం ఉంటేనే ప్రభుత్వ వాగ్దానాలు నెరవేరుతాయన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే సమస్యలు పరిష్కారం కావని, పోరాడి సాధించుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందనే విశ్వాసం ప్రజల్లో ఉండాలి కానీ, ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపించడంలేదని, కొన్ని ప్రలోభాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

**లబ్ధిదారులతో కలిసి ధర్నా చేస్తా:** దళితబంధు త్వరగా ఇవ్వకుంటే ఎంపిక చేసిన లబ్ధిదారులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని కెసిఆర్ ప్రకటించారు. ప్రజలు మౌనంగా ఉండకుండా పోరాడి సాధించుకోవాలని, అప్పుడే సమస్యలు పరిష్కరామవుతాయన్నారు. దళితవాడలు ధనికవాడలు కావాలని దళితబంధు పథకం తెచ్చాం. దాదాపు 1.30లక్షల మందికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు మంజూరు చేసిందని, ఆ డబ్బులను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. నాలుగు నెలలు అయినా రైతుబీమా, రైతుబంధు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## ఎన్నికల నిధి కోసం విజ్ఞప్తి

**ప్రియమైన కామ్రేడ్స్, మిత్రులారా..**

దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ఇప్పటికే ప్రకటించబడడంతో పాటు, నామినేషన్‌ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక, విభజనవాద, మతతత్వ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సిపిఐ, వామపక్షాలు సర్వశక్తులతో ప్రయత్నాలు చేస్తున్నాయి. కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రిత బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులన్నిటినీ ఏకం చేసేందుకు కృషి సాగుతున్నది. ప్రజాస్వామ్య భారతదేశ భవిష్యత్తు కోసం ఈసారి పెద్ద యుద్ధం జరుగుతున్నది.

అధికార పార్టీకి కార్పొరేట్ సంస్థలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఎలక్టోరల్ బాండ్స్‌లో దాతల జాబితాను ప్రచురించిన తరువాత ఈ వాస్తవం స్పష్టమైంది. ఎలక్టోరల్ బాండ్‌ల ద్వారా మన పార్టీ డబ్బును స్వీకరించలేదు. లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలో వామపక్షాలు కీలక పాత్ర పోషించాల్సి ఉన్నది. అలాగే ఎన్నికల ప్రక్రియ, విరాళాల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం నిలబడాలి. ఇది కమ్యూనిస్టుల భుజాలపై ఉన్న చారిత్రక బాధ్యత. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యులు, మద్దతుదారులు, మిత్రులు సిపిఐ ఎన్నికల నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని సిపిఐ జాతీయ సమితి విజ్ఞప్తి చేస్తున్నది.

పార్టీ కామ్రేడ్‌లు అందరూ విస్తృతంగా నిధులను సేకరించి, వాటిని రాష్ట్ర కేంద్రం లేదా పార్టీ కేంద్ర ప్రధాన కార్యాలయానికి పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం జరిగేవి అత్యంత కీలకమైన ఎన్నికలు. వామపక్షాలు, అందులో ప్రత్యేకించి సిపిఐ బలం పార్లమెంటులో పెరగాలి. తద్వారా రానున్న ప్రభుత్వంలో ప్రజల జీవనోపాధికి సంబంధించిన తక్షణ అంశాలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. ఇందు కోసం ప్రచారం చేసేందుకు మనకు అత్యవసరంగా నిధులు అవసరం. ప్రతి పార్టీ సభ్యుడు, అభిమాని తమ స్థోమతకు అనుగుణంగా పార్టీ నిధికి విరాళాలు ఇవ్వాలి. కింది చిరునామా, బ్యాంకు ఖాతాకు తక్షణమే చెక్‌లు/డ్రాఫ్ట్స్/ ఇ‌ఎంఒ/యుపిఐ ద్వారావిరాళాలు పంపించాలి.

**విరాళాలు పంపేందుకు వివరాలు :**

**చిరునామా :** Communist Party of India, Central Office, Ajoy Bhavan, 15, Indrajit Gupta Marg, New Delhi – 110002.

*ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సిన ఖాతా వివరాలు.*

*బ్యాంకు పేరు:* Canara Bank, Branch: CBSE, Rouse Avenue, New Delhi, account number: 24171010000036, IFSC No. CNRB0012417. UPI ID: 220958321000036@cnrb.



విప్లవ అభినందనలతో..

**డి.రాజా**
ప్రధాన కార్యదర్శి

## పవర్ కోసం 'పవార్'ల యుద్ధం

మహారాష్ట్రలో 'పవార్' కుటుంబంలో దాయాదుల మధ్య యుద్ధం తారస్థాయికి చేరింది. రాజకీయ దిగ్గజం శరద్ పవార్, ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ నువ్వా? నేనా? అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేతగా, తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయించిన శరద్ పవార్‌కు అజిత్ వేరు కుంపటి పెట్టి షాకిచ్చారు. ఏక్‌నాథ్ షిండేతో కలిసి, మహారాష్ట్ర కేబినెట్‌లో భాగస్వామి అయ్యారు. ఫలితంగా గత ఏడాది జులైలో ఎన్‌సిపి రెండు ముక్కలుగా చీలిపోయింది. ఎన్‌సిపి (శరద్ పవార్) వర్గానికి శరద్ పవార్, ఎన్‌సిపి (అజిత్ పవార్ ) వర్గానికి అజిత్ నాయకత్వం వహిస్తున్నారు. తన సోదరుడు అనంతరావు పవార్ కుమారుడైన అజిత్ ఈ విధంగా పార్టీ ని చీల్చడాన్ని శరద్ పవార్ జీర్ణించుకో లేకపోతున్నారు. ఈ ఘర్షణ కొనసాగుతునే ఉండగా, బారామతి నియోజకవర్గం ఈ అగాథాన్ని మరింత పెంచింది. ఇప్పటికే మూడు పర్యాయాలు బారామతి నుంచి ఎంపిగా ఎన్నికైన శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆమెకు పోటీగా, అజిత్ తన భార్య సునేత్ర పవార్‌ను బరిలోకి దించారు. సుప్రియ 'మహా వికాస్ అగాఢీ' నుంచి, సునేత్ర 'మహాయుతి' కూటమి నుంచి పోటీలో ఉన్నారు. బారామతిలో ఇటీవల జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న అజిత్ తన ప్రసంగంలో శరద్ పవార్‌తోపాటు సుప్రియపైనా విమర్శలు గుప్పించారు. 'మీరు పవార్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటున్నారు. గత మూడు పర్యాయాలుగా శరద్ పవార్ కుమార్తె సుప్రియను గెలిపిస్తూ వచ్చారు. ఈసారి కూడా పవార్ కుటుంబానికే ఓటు వేయండి... అయితే, సుప్రియకు కాదు.. సునేత్రకు' అన్నారు. అజిత్ వ్యాఖ్యలపై శరద్ పవార్ తీవ్రంగా స్పందిస్తూ, సునేత్రను 'పరాయి వ్యక్తి' గా అభివర్ణించారు. ఇక ఏముంది... రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం మొదలై, తీవ్రస్థాయికి చేరింది. నువ్వంటే నువ్వంటూ ఇరు వర్గాలు కయ్యానికి కాలుదువ్వుతున్నారు. పరస్పరం విమర్శనాస్త్రాలు కురిపించుకుంటున్నారు. ఇన్నాళ్లూ పవార్ కుటుంబానికి పెద్దపీట వేసిన బారామతి ఓటర్లు ఈ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారన్నది ఉత్కంఠ రేపుతున్నది. ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా 'పవార్' కుటుంబం గెలిచినట్టే అవుతుందని గుసగుసలాడుతున్న వారు కూడా లేకపోలేదు. ఈ నియోజవర్గం నుంచి మరో అభ్యర్థి మహేష్ సీతారామ్ భగవత్ (ఒబిసి బహుజన్ పార్టీ) కూడా పోటీలో ఉన్నారు. సుప్రియ, సునేత్ర మధ్య పోరు తీవ్రంగా ఉంటే, ఓట్లు చీలిపోయి, మధ్య లో తాను గెలిచే అవకాశం ఉండకపోతుందా అని భగవత్ ఆశ. ఏం జరుగుతుందో చూద్దాం.


సునేత్ర పవార్ సుప్రియా సూలే

## గుజరాత్ స్పీకర్ ఓవరాక్షన్!



లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీ... స్పీకర్ పదవికి ఎన్నికైన ఎవరైనా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి. 'పార్లమెంటరీ సంప్రదాయాలు.. విధానాలు మొదటి భాగం'లోని 2వ పేరా, చాప్టర్ IXలో ఈ విషయం స్పష్టంగా ఉంది. స్పీకర్ పదవికి ఎన్నికైన మరుక్షణం నుంచే రాజకీయ పార్టీల కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అందులో పేర్కొన్నారు. అయితే, గుజరాత్ అసెంబ్లీ స్పీకర్ శంకర్ చౌదరి ఈ నిబంధనలను బుట్టదాఖలు చేశారు. బనస్కంత లోక్‌సభ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేఖా చౌదరికి మద్దతుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. స్పీకర్‌గా ఉన్నప్పుడు, ఇలాంటి రాజకీయ కార్యకలాపాలకు హాజరుకాకూడదన్న కనీస నిబంధనను కూడా పాటించని చౌదరిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులో కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ దోషి కోరారు. రాజ్యాంగాన్ని అనుసరించని వ్యక్తి ఒక రాష్ట్ర అసెంబ్లీకి స్పీకర్‌గా ఎలా పనికి వస్తాడన్నది ప్రశ్న.

## అత్యంత ధనిక... అతిపేద ఎంపిలు!

లోక్‌సభ ఎన్నికలకు యావత్ దేశం సిద్ధమవుతున్నది. మరో వారం రోజుల్లో మొదటి దశ పోలింగ్ ప్రారంభకానుండగా, గత లోక్‌సభలో అత్యంత ధనిక, అతిపేద ఎంపిలు ఎవరనే ఆసక్తి సహజం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక ప్రకారం, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్ అత్యంత ధనవంతుడు. చింద్వారా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైన అతని ఆస్తి విలువ అక్షరాలా రూ. 660 కోట్లు. ఆ తర్వాతి స్థానం తమిళనాడులోని కన్యాకుమారి నియోజకవర్గం నుంచి ఎన్నికైన హెచ్. వసంతకుమార్ దక్కించుకున్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 417 కోట్లు. బెంగళూరు (కర్నాటక) ఎంపి డికె సురేష్ రూ.338 కోట్ల విలువైన ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ నరసాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఆస్తుల విలువ రూ.325 కోట్లు. ఆయనది ఈ జాబితాలో నాలుగో స్థానం. వైసిపి నుంచి ఎన్నికైన ఆయన, తదనంతరం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇక, ప్రస్తుతం రాజకీయాల నుంచి వైదొలగిన గల్లా జయదేశ్ ఆస్తులు రూ. 305 కోట్లు. ఆయన అంధ్రప్రదేశ్‌లోని గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన టిడిపి అభ్యర్థిగా గెలుపొందారు.కాగా, అతిపేదల జాబితాలో మొదటి పేరు ఆంధ్రప్రదేశ్‌కే చెందిన అరకు లోక్‌సభ సభ్యురాలు గొడ్డేటి మాధవి. 2019 ఎన్నికల సమయంలో దాఖలు చేసిన డిక్లరేషన్‌ను అనుసరించి ఆమెకు కేవలం 1.4 లక్షల రూపాయల ఆస్తులు ఉన్నాయి. ఒడిశాకు చెందిన చంద్రాని ముర్మ గత లోక్‌సభ ఎన్నికల్లో కొయెంజర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆమె ఆస్తుల విలువ రూ. 3.4లక్షలు. లోక్‌సభలో అత్యంత పిన్న వయస్కురాలు కూడా ఆమెనే కావడం విశేషం. వరుసగా రెండు పర్యాయాలు ఎంపిగా గెలిచిన అనంత్ నాయక్‌ను ఓడించడం ఆమె సాధించిన మరో ఘనత. కాగా, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ బిజెపి అభ్యర్థిగా గెలిచిన సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ ఆస్తుల విలువ 4.4 లక్షల రూపాయలు మాత్రమే. దేశంలోని ధనిక, పేద వర్గాల మధ్య ఉన్న భారీ తేడా లోక్‌సభలోనూ కనిపిస్తున్నది.


నకుల్ నాథ్



## మోడీతో ఢీ

ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్న వారణాసి లోక్‌సభ స్థానం ఈసారి ఎవరికి దక్కుతుందనే చర్చ జరుగుతున్నది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నందున, ఆయన గెలుపు అనుకున్నంత సులభం కాదన్న వాదన వినిపిస్తున్నది. ఉత్తరప్రదేశ్ (యుపి)లో మొత్తం 80 పార్లమెంటు స్థానాలు ఉండగా, వాటిలో వారణాసి అత్యంత కీలకమైనది. ఈ నియోజకవర్గం ఆది నుంచి భారత రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తునే ఉంది. యుపి మాజీ సీఎంలు త్రిభువన్ సింగ్, కమలాపతి త్రిపాఠి, బిజెపి కురువృద్ధుడు మురళీ మనోహర్ జోషి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ వంటి ఎంతోమంది ప్రముఖులు ఇక్కడి నుంచే పార్లమెంటుకు వెళ్లారు. సహజంగా వారణాసి పేరు వినగానే ఆధ్యాత్మిక కేంద్రం గుర్తుకొస్తుంది. అయితే, ఎంతో మంది హేమాహేమీలను లోక్‌సభకు పంపడం ద్వారా రాజకీయంగానూ వారణాసి ప్రాధాన్యతను సంతరించుకుంది. వారణాసి పార్లమెంట్ పరిధిలో రోహనియా, వారణాసి నార్త్, వారణాసి సౌత్, వారణాసి కంటోన్మెంట్, సేవాపురి అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇక్కడి నుంచి వరుసగా మూడోసారి గెలిచి, హ్యాట్రిక్ సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు మోడీ. సహజంగానే హిందూత్వ కార్డునే ఆయన మరోసారి ప్రయోగిస్తున్నారు. అయితే, ఇక్కడ ముస్లింల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. జ్ఞానవాపి, అలంగీర్ మసీదులు ఇక్కడే ఉన్నాయి. కాబట్టి ముస్లింలకు కూడా వారణాసి ఆధ్యాత్మిక కేంద్రమే. 1952లో ఏర్పడిన వారణాసి లోక్‌సభ నియోజకవర్గం చాలా కాలం కాంగ్రెస్‌కు కంచుకోటలా ఉండేది. ఆ తర్వాత బిజెపికి అడ్డాగా మారింది. మొత్తం మీద ఇక్కడి నుంచి కాంగ్రెస్ 8 సార్లు, బిజెపి 7 సార్లు విజయం సాధించగా, ఇతరులు మూడు సార్లు గెలుపొందారు. 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వారణాసి పార్లమెంట్ పరిధిలోని ఐదు శాసనసభ స్థానాల్లో బిజెపి 4, అప్నాదళ్ ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మొత్తం 1,535 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న వారణాసి జిల్లా జనాభా 36,76,841. ఈ జిల్లా అక్షరాస్యత 75.6 శాతం. వారణాసి లోక్‌సభ పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 18,54, 540. గత(2019) లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి, ప్రధాని మోడీకి 6,74, 664ఓట్లు వచ్చాయి. సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి షాలిని యాదవ్కు 1,95,159 ఓట్లు సంపాదించారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌కు 1,52,548 ఓట్లు పోలయ్యాయి. మోడీ 4,79,505 ఓట్ల తేడాతో గెలిచారు. యుపి కాంగ్రెస్ అధ్యక్షు డు అజయ్ రాయ్ మరోసారి ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు.

## గిరిజన మహిళ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

### తెలంగాణ పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క




ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి : అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని, జిల్లాలోని ప్రకృతి సిద్ధ ఆలయాలను, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్, రెబ్బెన మండలాలలో పర్యటించారు.

రెబ్బెన మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క చాయ్ హోటల్ వద్ద చాయ్ తయారుచేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తూ పలువురికి చాయ్‌ని అందజేశారు. ప్రచారానంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు కాంగ్రెస్ పార్టీలో చేర గా మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గంగాపూర్ గ్రామపంచాయతీలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తుల కోసం తయారు చేస్తున్నటువంటి పిండి వంటల వద్దకు వెళ్లి పిండి వంటలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సహజసిద్ధంగా వెలిసినటువంటి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సామాన్యమైన జీవితం నుండి వచ్చిన గిరిజన మహిళ సుగుణను గెలిపించడానికి అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని, సామాన్య జీవితాన్ని గడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉండే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు సాగుతూ ఎంపి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. జూన్ 4 తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొన్నటి దాకా అంతా ఒకే పార్టీ..నేడు వారే ప్రత్యర్థులు

### ఓరుగల్లు అభ్యర్థుల ప్రకటనతో ఇక ప్రచారంపైనే దృష్టి



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : ఓరుగల్లు లోక్‌సభ పోరుపై ఉత్కంఠకు తెరపడింది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో లోక్‌సభ పోరు ముఖచిత్రం స్పష్టమైంది. మొన్నటి వరకు బిఆర్ఎస్ అభ్యర్థిపై ఉత్కంఠ నెలకొనగా బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ తమ పార్టీ ఎంపి అభ్యర్థిగా హన్మకొండ జడ్‌పి చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్‌ను శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్ నుండి స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎ, సీనియర్ నాయకులు కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను, బిజెపి నుండి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే.

వరంగల్ పార్లమెంటులో పోటీచేయనున్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించడంతో కడియం కావ్య, ఆరూరి రమేష్, డాక్టర్ సుధీర్‌కుమార్‌ల మధ్య పోటీ అనేది స్పష్టంగా తెలుస్తున్నది. అభ్యర్థుల ప్రకటనతో ఇక లోక్‌సభ ఎన్నికలలో ప్రచారంపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కొద్ది రోజులుగా కాంగ్రెస్, బిజెపి సమీక్షలు, సమావేశాల పేరుతో పోటీకి సన్నాహక కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్,బిజెపి ఒకడుగు ముందు ఉండగా బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకటనతో వివిధ కార్యక్రమాల పేరుతో జనం వద్దకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ నియోజక వర్గాలలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక చేపట్టింది. అలాగే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో గెలచి అధికారంలోకి వచ్చిన ఊపుతో కాంగ్రెస్ జోరు మీద ఉంది. మరోవైపు బీజేపి గడిచిన ఎన్నికలలో పెద్దగా ప్రభావం చూపక పోవడంతో కొంత వెనుకబడినా లోక్‌సభ ఎన్నికలలో గట్టి పోటీని ఇవ్వాలని చూస్తున్నది.

బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను బిజెపిలో చేర్చుకుని టికెట్ కేటాయించింది. ఆ రెండు పార్టీలతో పాటు బిఆర్ఎస్ గతంలోని తమ సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నది. లోక్‌సభ నియోజక వర్గాల పరంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభా స్థానాలు ఉన్నాయి. వీటిలో వరంగల్ లోక్‌సభ నియోజక వర్గం ఎస్సీ సామాజిక వర్గానికి, మహబూబాబాద్ నియోజక వర్గం ఎస్‌టి సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి.

**ఎంపి పరిధిలో అంతా కాంగ్రెస్ ఎంఎల్ఎలు**

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటి అసెంబ్లీ నియోజక వర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. వరంగల్ లోక్ సభ పరిధిలో 7అసెంబ్లీ నియోజక వర్గాలలో 6 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లో మాత్రమే బిఆర్ఎస్ విజయం సాధించింది. అయినప్పటికీ స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎగా ఉన్న కడియం శ్రీహరి గత నెలలో తన కూతురుతో కలిసి అధికార కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వరంగల్ లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంఎల్ఏలే ఉన్నారు.

**వరంగల్‌లో పోటీ ఆసక్తికరం**

లోక్‌సభ ఎన్నికలవేళ ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో ఎట్టకేలకు ప్రధాన పార్టీల అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. ఇప్పటికే కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులను ప్రకటించగా తాజాగా బిఆర్ఎస్ తమ అభ్యర్థిపై స్పష్టతనిచ్చింది. బిఆర్ఎస్ నుంచి వచ్చిన వారినే రెండు జాతీయ పార్టీలు తమ అభ్యర్థులుగా బరిలోకి దించగా ఆచితూచి వ్యవహరించిన గులాబి దళపతి ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నారు. కాగా పోటీలో ఉన్న వారంతా బిఆర్ఎస్‌లో కలిసి పనిచేసిన వారే కావడం గమనార్హం.

ఒకే గూటి నుంచి వచ్చి రాబోయే ఎన్నికల్లో ప్రత్యర్థులుగా మారిన ముగ్గురు అభ్యర్థుల సమరం ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## స్వాతంత్ర్యం తెచ్చింది..తెలంగాణ ఇచ్చింది.. కాంగ్రెస్సే

### ఎంఎల్ఎ జిఎస్ఆర్, ఎంపి అభ్యర్థి కడియం కావ్య



ప్రజాపక్షం/చిట్యాల : భారతదేశంలో మతతత్వమైన బిజెపి పార్టీ దేశానికి చాలా ప్రమాదకరమని దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ, తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పార్లమెంటు ఎన్నికల్లో దేశ, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ఆదరించి హస్తం గుర్తుకు ఓటువేసి వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి నియోజకవర్గ ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణ రావు ప్రజలను కోరారు. మండలంలోని జూకల్ బిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన భూపాలపల్లి నియోజకవర్గ ఎంఎల్ఎ జిఎస్ఆర్, వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి కడియం కావ్య హాజరయ్యారు. భూపాలపల్లి ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతు భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి విద్య, వైద్యం పట్ల పేదవారికి అందే విధంగా కృషి చేస్తూ భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని విభాగాలలో ముందుండే విధంగా రాష్ట్రంలో నెంబర్ వన్‌గా నిలబెడతానని ప్రజల కోసం పాలకుడిగా కాకుండా సేవకుడిలా సేవ చేస్తానని ప్రజల పట్ల అంకిత భావంతో పనిచేస్తానని ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు దాదాపు పేదలకందే విధంగా చూస్తామని, ఇందిరమ్మ ఇండ్లను పార్లమెంట్ ఎన్నికల తర్వాత నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ధరణిని రద్దు చేసి రైతుల భూములు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎంపి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపి అభ్యర్థి కడియం కావ్యను లక్ష మెజార్టీతో భూపాలపల్లి నియోజకవర్గం నుండి కార్యకర్తలు సైనికుల్లా పని చేసి కావ్యను గెలిపించాలని, కార్యకర్త లు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తూ ప్రతి ఇంటి నుండి హస్తం గుర్తుకు ఓటు పడే విధంగా చూడాలని అన్నారు.

వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ బిజెపి మతతత్వ పార్టీ అని బిఆర్ఎస్ మాయమాటల పార్టీ అని ఈ రెండు పార్టీలు దొందుదొందేనని ఈ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కులు లేవని ఎంపి అభ్యర్థి కావ్య ఎద్దేవా చేశారు. బిజెపి అభ్యర్థి గుట్టలు మాయం చేస్తే బిఆర్ఎస్ అభ్యర్థి గుర్తు తెలియని వ్యక్తి అని చేతి గుర్తుకు ఓటు వేసి ఈ ప్రాంత ప్రజలు లక్ష మెజార్టీని ఇచ్చి గెలిపించాలని కావ్య కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, ఆర్ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ కట్టంగూరి రామ్ నర్సింహారెడ్డి, జడ్‌పిటిసి పులి తిరుపతిరెడ్డి, అప్పం కిషన్, దెబ్బేట రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముక్కిరాల మధువంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, ఏకు రవీందర్, చిలుకల రాజ కొమురు, తడుక కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, గడ్డం కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు ఆశయాలతో ముందుకు వెళ్తాం

### పెద్దపల్లి ఎంపిగా వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలి

### రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/మంథని : మంథని నియోజకవర్గ అభివృద్ధి, ఈ ప్రాంత పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన తన తండ్రి స్వర్గీయ దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆలోచన, ఆశయాలతో ముందుకు సాగుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్వర్గీయ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా మంథని పట్టణంలో శ్రీ నృసింహ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతిసభ, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ శ్రీపాదరావు చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పనాయకుడు శ్రీపాదరావు అన్నారు. 1999లో తన తండ్రి మరణానంతరం రాజకీయాల్లో వచ్చానని, ఆనాటి నుంచి ఈనాటి వరకు పేద ప్రజల కోసమే పనిచేస్తున్నానని అన్నారు. ముఖ్యంగా పేదవర్గాలకు కూడు, గుడ్డ కల్పించాలనే తన తండ్రి ఆశయాలతో ముందుకెళ్తున్నట్లు ఆయన చెప్పారు. అధికారం ఉన్నా లేకున్నా తనతో నడిచి తన కష్టాల్లో పాలు పంచుకున్న ప్రతి కార్యకర్త, నాయకుడికి అండగా నిలుస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధి ప్రజాసంక్షేమమే తన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. ఈనాడు కొంతమంది వీధి కుక్కల్లా మొరుగుతున్నారని, తన పేరు ఎత్తకుండా పూటగడువదని, అలాంటి వాళ్ల గురించి పట్టించుకోవద్దని, మన లక్ష్యం వైపు మాత్రమే పయనించాలని ఆయన కార్యకర్తలకు సూచన చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమపై ఎంత నమ్మకంతో అధికారం అప్పగించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అయితే ఈ క్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ వెంకటస్వామి వారసుడు గడ్డం వంశీ కృష్ణను బరిలో ఉంటున్నాడని, ఆయన గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. విద్యావేత, వ్యాపారవేత్త, యువకుడైన వంశీకృష్ణ ఎంపిగా గెలిస్తే ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. చిన్న వయస్సులో పరిశ్రమను స్థాపించి ఎంతోమంది యువకులకు ఉపాధి కల్పించారని వివరించారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూర్ ఎంఎల్ఎ వివేక్‌ల సహకారంతో మంథని ప్రాంతంలో పరిశ్రమలు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయని యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అంతేకాకుండా పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో వంశీ కృష్ణరాజకీయాల్లో వచ్చారని, ఆయనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రామగుండం, చెన్నూర్, బెల్లంపల్లి, ధర్మపురి ఎమ్మెల్యేలు ఠాకూర్ మక్కాన్‌సింగ్, వివేక్, వినోద్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, ఐఎన్‌టియుసి నాయకుడు వెంకట్రావ్, నాయకులు జనక్‌ప్రసాద్, మహంకాలి స్వామి, శశిభూషన్‌కాచే, ఐలి ప్రసాద్, సదానందం,తొట్ల తిరుపతి యాదవ్, ఐత ప్రకాష్‌రెడ్డి, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ సురేష్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.



# తెలుసుకుందాం

## ఆర్కిమెడిస్ 'డెత్ రే' పునరావిష్కరణ

కెనడాకు చెందిన విద్యార్థి బ్రెండెన్ సెనెర్ వయసు కేవలం 12 సంవత్సరాలు. అయితేనేం, సుమారు 2000 సంవత్సరాల క్రితం ఆర్కిమెడిస్ ప్రతిపాదించిన 'డెత్ రే'ను తిరిగి సృష్టించాడు. తన సరికొత్త సైన్స్ ప్రయోగంతో పాత చర్చకు మళ్లీ కొత్త ఊపిరి నిచ్చాడు. ఆర్కిమెడిస్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం అద్దాలు వేడిని తీవ్రతరం చేస్తాయి. అయితే, అతను కేవలం పురాణాల ఆధారంగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడని, ఈ సిద్ధాంతానికి సాంకేతిక ప్రమాణికత లేదని చాలా మంది అప్పట్లో వాదించారు. ఫలితంగా, ప్రపంచ పరిశోధనా రంగంలో చాలాకాలం ఇదొక చర్చగా ఉండేది. రోమన్ నౌకలను దగ్ధం చేయడానికి




ఇలాంటి దర్పణాలను ఉపయోగించి, సూర్యరశ్మిని ఒక అగ్ని ఉత్పాదక మూలకంగా ఉపయోగ్యించే వారన్న నమ్మకం చాలా మందికి ఉండేది. అది నిజమేనా? సూర్యరశ్మిని ఉపయోగించి పెద్దపెద్ద ఓడలను దగ్ధం చేయడం సాధ్యమా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఉండేది కాదు. క్రీస్తుపూర్వం 214 నుంచి 212 మధ్య వరకూ సిరక్యూస్ జరిపిన ముట్టడిలో రోమన్ ఆర్మీ జనరల్ మార్కస్ క్లాడియస్ మార్సెలస్ ఈ ప్రయోగంతో సిసిలీ ద్వీపాన్ని జయించడానికి ప్రయత్నించినట్టు ప్రచారంలో ఉంది. ఆర్కిమిడిస్ కూడా ఇలాంటి సిద్ధాంతంతోనే 'డెత్ రే'ని ప్రతిపాదించాడు. శతాబ్దాల తర్వాత కెనెడియన్ స్టూడెంట్ బ్రెండెన్ సెనెర్ ఆ సిద్ధాంతాన్ని రుజువు చేయడానికి ప్రయత్నించాడు. కేవలం పుటాకార దర్పణాలు, ఎల్ఇడి దీపాలతో తన ప్రయోగాన్ని నిర్వహించాడు. సూర్యరశ్మిని అద్దాలతో ఉపయోగించడం వలన ఉష్ణోగ్రత గణనీయమైన పెరుగుదలకు దారితీస్తుందని, దహన ప్రక్రియను సులభతరం చేయగలదని నిరూపించాడు. 100 వాట్ల బల్బుతో మొదటి అద్దం లక్ష్యం యొక్క ఉష్ణోగ్రతను సుమారు 46 డిగ్రీల ఫారెన్‌హీట్ మే పెంచింది. అదనంతరం రెండు అద్దాలు వేడిని 38 నుంచి 40 డిగ్రీల వరకూ పెంచాయి. నాలుగవ అద్దం ఉష్ణోగ్రతను 50 నుంచి 128 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు పెంచింది. దీనితో ఆర్కిమెడిస్ డెత్ రే సాంకేతికంగా రుజువైంది. మరోసారి ఆ నాటి డెత్ రేను మరోసారి ఆవిష్కరించి చూపిన ఘనత సెరెన్‌కు దక్కుతుంది.



## విశ్వ వ్యాసం ఎంత?



విశ్వం అంటే ఏమిటి? సూర్యుడు, దాని చుట్టూ తిరిగే గ్రహాలు, ఆయా గ్రహాలకు ఉన్న ఉపగ్రహాలు.. వెరసి సౌర మండలం. మనం పరిశీలించదగిన విశ్వంలో వేలు, లక్షల సౌర మండలాలు ఉన్నట్టు అంచనా. ఇక మనం పరిశీలించడానికి అసాధ్యమైన విశ్వం విస్తీర్ణం ఎంత అనేది ఊహించడం కూడా కష్టమే. ఇంతకీ మనం పరిశీలించతగిన విశ్వం వ్యాసం ఎంత ఉంటుందో తెలుసా? వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారం, ఇతర ప్రామాణికతల ఆధారంగా విశ్వం వ్యాసాన్ని సుమారు 93 బిలియన్ కాంతి సంవత్సరాలుగా నిర్ధారించారు. ఒక భూ సంవత్సరంలో కాంతి ప్రయాణించగల దూరం సుమారు 9.46 ట్రిలియన్ కిలోమీటర్లు (5.88 ట్రిలియన్ మైళ్ళు). బిగ్ బ్యాంగ్ ద్వారా విశ్వం ఆవిర్భవించిందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. దీని అంచనా వయస్సు 13.8 బిలియన్ సంవత్సరాలు, కాబట్టి మానవులు చూడగలిగే అంతరిక్షంలోని వస్తువుల ద్వారా విడుదలయ్యే కాంతి 13.8 బిలియన్ సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుండి భూమి వైపు ప్రయాణిస్తోంది. పరిశీలించదగిన విశ్వం భూమి నుండి ఏ దిశలోనైనా 13.8 బిలియన్ కాంతి సంవత్సరాలు, వ్యాసంలో 27.6 బిలియన్ కాంతి సంవత్సరాలుగా పేర్కొంటున్నారు. కాగా, హబుల్ థియరీని అనుసరించి బిగ్ బ్యాంగ్ నుంచి అంతరిక్షం విస్తరిస్తున్నది. కాబట్టి, గమనించతగిన విశ్వం కూడా విస్తరిస్తునే ఉంది.

## ల్యాండ్ ఆఫ్ మిడ్‌నైట్ సన్

అర్ధరాత్రి సూర్యుడు (మిడ్‌నైట్ సన్) ల్యాండ్‌గా నార్వేను పేర్కొంటారు. దీనికి యూనిటరీ, మొనార్కీ అనే పేర్లు కూడా ఉన్నాయి. ప్రపంచంలో అతి తక్కువ జనాభాగల దేశాల్లో ఇది ఒకటి. ఎత్తయిన మంచు పర్వతాలు ఈ దేశంలో ఎక్కువ. వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. కానీ, మే చివరి నుంచి జులై వరకు సూర్యుడు ఇక్కడ సుమారు 20 గంటలు కనిపించడంతో, చీకటిపడిన ఆనవాళ్లు చాలా అరుదు. అందుకే మిడ్‌నైట్ సన్



ల్యాండ్ అనే పేరు వచ్చింది. చాలా దేశాల్లో సూర్య గమనాన్ని బట్టి, పగలు, మధ్యాహ్నం, సాయంత్రం అని తెలుసుకుంటారు. కానీ, ఇక్కడి ప్రజలు మాత్రం సూర్యుడిపై కాకుండా, వాచీలపై ఆధారపడి తమ తమ దైనందిన కార్యక్రమాలను నిర్వహించుకుంటారు. కాగా, ఉత్తర ఐరోపాకే చెందిన మరో దేశం ఫిన్లాండ్. సుమాలు ఆరు మిలియన్ల జనాభా ఉన్న ఈ ద్వీపం స్వీడన్ నుంచి వేరుపడింది. ఇక్కడ 1.70లక్షల వరకు సరస్సులు, 1.80లక్షల వరకు ద్వీపాలు ఉండడం గమనార్హం. ఎక్కువ మంచు పర్వతాలు కలిగిన దేశం. అంతేకాదు.. ఇక్కడి భూమి ఏటా సెంటిమీటర్ పెరుగుతున్నది. ఉత్తర, దక్షిణ సముద్ర తీరాల్లో పెను వాతావరణ మార్పులు సంభవిస్తాయి. ఉత్తర దిశలో సూర్యుడు వేసవిలో 73 వరుసగా రోజులు అస్తమించడం. అలాగే 51 రోజులు అసలే ఉదయించడు. అంటే ఆయా రోజుల్లో, నిరంతరాయంగా పగలు... రాత్రులు కొనసాగుతాయి.

## స్పైడర్లు రకరకాలు..



సాలె పురుగు (స్పైడర్)ను చూడని వారు దాదాపుగా ఉండరు. సాలె గూళ్ల (బూజు)ను ఎప్పటికపడు శుభ్రం చేసుకోవడానికి కష్టపడనివారు కూడా ఉండరు. అయితే, ఈ స్పైడర్లు చాలా రకాలు ఉన్నాయన్నది మాత్రం చాలా తక్కువ మందికే తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది జాతుల సాలెపురుగులు ఉన్నాయి. వాటిలో కొన్ని చాలా ప్రమాదకరమైనవి. ఒక వ్యక్తి కాటుకు గురైనప్పుడు.. అతను సకాలంలో చికిత్స పొందకపోతే చనిపోయే ప్రమాదం కూడా ఉంది. సముద్రంలోనూ సాలెపురుగులు కనిపిస్తాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ, శాస్త్రవేత్తలు ఇప్పుడు కొత్త జాతి సముద్ర సాలీడును కనుగొన్నారు. ఈ వింత సాలీడు సముద్ర మట్టానికి 1,870 అడుగుల (570 మీటర్లు) దిగువన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీని శరీరం దాదాపు 0.4 అంగుళాలు (1 సెం.మీ.) పొడవు ఉంటుంది, అయితే దాని కాళ్లు దాదాపు 1.2 అంగుళాల (3 సెం.మీ.) పొడవు ఉంటాయి. ఇక ఈ సముద్ర సాలీడులో ఒక ప్రత్యేకమైన ఆహారపు అలవాటు ఉన్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆహారం తినడానికి, అది నోటిని కాకుండా, గడ్డి లాంటి ట్రంక్‌ను ఉపయోగిస్తుంది. ఈ జాతిలో కనిపించే మరొక వింత అది శ్వాస తీసుకునే విధానం. ఈ సాలీడు తన పాదాలతో శ్వాస తీసుకుంటుంది. పసుపురంగుతో ఉండే ఈ సముద్ర సాలీడు చూడడానికి బాక్సింగ్ గ్లోవ్స్ లాగా కనిపిస్తుంది. అంటార్కిటిక్ మహాసముద్రంలో దీని ఉనికిని కనుగొన్నారు. ఈ స్పైడర్‌కు నలుపు రంగులో, భయంగొలిపే విధంగా నాలుగు కళ్ళు ఉన్నాయి. ఇంతకు ముందెన్నడూ చూడని ఈ విశిష్టమైన సముద్ర సాలీడుకు 'ఆస్ట్రోపాలీన్ హలానిచి'అని పేరుపెట్టారు. ఇది గుర్రపుడెక్క పీత, అరాక్నిడ్ల జాతికి చెందినదిగా పేర్కోవచ్చు.

## జ్వరం ఎందుకు వస్తుంది?

శరీరం యొక్క సాధారణ ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్ (98.6 డిగ్రీల ఫారెన్‌హీట్) కంటే ఎక్కువగా ఉంటే, ఆ స్థితిని జ్వరం అంటారు. దీనిని ఉష్ణమాపకం లేదా థర్మామీటర్ ద్వారా కొలుస్తారు. బాక్టీరియా, ఫంగస్ వివిధ రకాలైన వైరస్‌తో మనిషి శరీరంలోని సహజసిద్ధమైన రోగ నిరోధక వ్యవస్థ పోరాడుతుంది. ఆ సమయంలో శరీర ఉష్ణోగ్రత పెరుగు




తుంది లేదా జ్వరానికి కారణమవుతుంది. జలుబు, (రొంప లేదా పడిశెం) వల్ల త్వరగా జ్వరం వస్తుంది. అదే విధంగా చెవిపోటు, బ్రాంఖైటిస్, నోటిపూత, మూత్రకోశ వ్యాధులు కూడా జ్వరానికిగ కారణం. వీటితోపాటు మానసిక ఒత్తిడి, ఆవేదన, శోకం వంటివి కూడా జ్వరం వస్తుంది. అతిగా వ్యాయమం చేసినా, కొన్ని మందులు మోతాదుకు మించి వాడినా జ్వరం రావచ్చు. జ్వరాల్లో చలి జ్వరం, సన్నిపాత జ్వరం (టైఫాయిడ్), మలేరియా జ్వరం, బాలెంత జ్వరం, డెంగ్యూ జ్వరం, చికెన్ గున్యా జ్వరం వంటి ఎన్నో రకాలున్నాయి. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల ఫారిన్ హీట్ కన్నా తక్కువగా వుంటే, ప్రత్యేకమైన వైద్యం అవసరం లేదు. పుష్కలంగా పానీయాలు సేవిస్తే చాలు. జ్వరాన్ని అదుపు చెయ్యడానికి 'అస్పిరిన్' ఎసిటామినో ఫెన్, ఐబూప్రొఫేన్ వంటివి తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తారు. గోరువెచ్చని నీటిలో స్నానం చేసినా శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుంది. జ్వరం 103 డిగ్రీల ఫారిన్ హీట్ దాటి, 2 గంటల కంటే ఎక్కువసేపు ఉన్నా, వచ్చి 2 రోజులు దాటినా, టెంపరేచర్ 105 డిగ్రీస్ ఫారిన్హీట్ దాటినా, వైద్యుడిని సంప్రదించాలి. సాధారణంగా జ్వరానికి చికిత్స చెయ్యాల్సిన అవసరం లేదు. మన దేశంలో జలుబుతో జ్వరం వస్తే పాలల్లో మిరియాలు మరిగించి తాగి విశ్రాంతి తీసుకొమ్మని చిట్కా చెప్తారు.

సేకరణ: బిఎస్ఎస్ మైత్రేయి

# ఎన్నికల బాండ్ల అవినీతిపై లోతైన దర్యాప్తు అవశ్యం

సార్వత్రిక ఎన్నికల సందట్లో ఎన్నికల బాండ్ల అవినీతిపై జరగవలసినంత చర్చ జరగలేదు. స్వతంత్ర భారత ఎన్నికల చరిత్రలో దీంతో సరిపోల్చదగిన అవినీతి మరొకటి కనిపించదు. అందులోనూ అవినీతిపై యుద్ధం చేస్తున్నట్లు చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రసిద్ధ న్యాయవాది – ఆర్థిక మంత్రి (కీ.శే) అరుణ్‌జైట్లీ జంట ఆలోచనలనుండి ఉద్భవించిన ఎన్నికల బాండ్‌ల చట్టం, 2018, ఇంత అప్రతిష్ట మూటగట్టుకోవటం వివేచనాపరుల ఊహకందనిది. భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఈ బిల్లు ప్రవేశపెట్టక మునుపే ఆర్‌బిఐ వంటి రెగ్యులేటరీ సంస్థ, విధాన నిర్ణాయక సంస్థలు వ్యక్తం చేసిన సందేహాలు వాస్తవికమైనవని – ఆ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసిన సుప్రీం కోర్టు ఆదేశంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నికల కమిషన్‌కు అందజేసిన ఎన్నికల బాండ్‌ల దాతలు, స్వీకర్తల వివరాలు ధృవీకరించాయి. ఈ పథకం అమలు జరిగిన ఐదున్నర సంవత్సరాలకాలంలో రాజకీయ పార్టీల వేలకోట్ల రూపాయలను ఈ బాండ్‌ల రూపేణా జమచేసుకున్నాయి. ఒక్క బిజెపికే అందులో సింహభాగం – 75శాతం దాకా (రు.8500 కోట్లు) అందినట్లు వెల్లడైంది. రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకతను ప్రవేశపెట్టటం, ఎన్నికల్లో నల్లధనం ప్రభావాన్ని అరికట్టటం అనే పవిత్ర లక్ష్యాలను ప్రభుత్వం ప్రకటించింది. మనీలాండరింగ్, పన్ను ఎగవేత వంటి ఆర్థిక నేరాలకు దారితీయవచ్చునని ఆర్‌బిఐ, ఎన్నికల కమిషన్ అధికారులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చటం గుర్తు చేసుకోదగింది. రూ.1000, రూ.500 కరెన్సీ నోట్ల చలామణీని ఆకస్మికంగా రద్దు చేస్తూ 2016 నవంబరు 8న ప్రధానమంత్రి ప్రకటించిన సందర్భంలో చెప్పిన లక్ష్యాల్లో మొదటిది నల్ల ధనం వెలికితీయటం, రెండు, దొంగనోట్లను అరికట్టటం, మూడు, టెర్రరిస్టులకు ఆర్థిక వనరుల అందుబాటను మూసివేయటం. చలామణీలో ఉన్న కరెన్సీలో 75శాతంగా ఉన్న ఈ పెద్దనోట్ల రద్దు వల్ల ప్రజలు, ఆర్థిక వ్యవస్థ కుదేలయినాయి గాని ప్రకటిత లక్ష్యాల్లో ఒక్కటీ నెరవేరలేదు. బడాబాబులవద్దనున్న నల్లధనం అధికారికం గా తెల్లధనం కింద మారిందని ఆరోపణ లు వచ్చాయి. మార్కెట్‌లో ఉన్న పెద్దనోట్లలో 99శాతం పైగా రిజర్వుబ్యాంక్‌కు తిరిగి చేరటమే నిదర్శనం. వైఫల్యాన్ని ఒప్పుకునే అలవాటులేని ప్రభుత్వం ప్లేటు ఫిరాయించి, డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించటానికి ఆ చర్య తీసుకున్నట్లు చెప్పింది. ఈ ఎన్నికల బాండ్లదీ అదే తంతు. రాజకీయ పార్టీలకు కంపెనీలు విరాళాలివ్వటం ఆదినుంచి ఉన్నదే. అయితే వాటిని కొంత నియంత్రణలో ఉంచేందుకుగాను, కంపెనీల విరాళాలు తమ క్రితం మూడు సంవత్సరాల నికర లాభాల్లో 7.5శాతానికి మించరాదని కంపెనీల చట్టంలో పరిమి తి విధించబడింది. ఘనత వహించిన మోడీ ప్రభుత్వం ఆ నిబంధనను రద్దు చేసింది. తక్కువకాలంలో ఎక్కువ మొత్తంలో నిధులు పోగుచేసుకునే ఉద్దేశంతోనే ఇదంతా చేశారా అన్న అనుమానానికి ఆస్కారం లేకపోలేదు. రాజకీయాధికారాన్ని వేగంగా విస్తరించుకునేందుకు ఆ ధనం సహాయకారి అయిందనవచ్చు.

ప్రజాపక్షం
14-04-2024, ఆదివారం

ఎన్నికల కమిషన్ వెబ్–సైట్ ద్వారా వెల్లడైన సమాచారాన్ని విశ్లేషించగా, అనేక వింతలు వెలుగుచూశాయి. 2016–17 నుంచి 2022–23 మధ్య మొత్తంమీద రూ.1లక్ష కోట్లు నష్టాలున్న 33కంపెనీలు రూ.582 కోట్లు విలువైన ఎన్నికల బాండ్లు కొన్నాయి. లాభాలార్జిస్తున్న కంపెనీలు తమ లాభాలను ఎంతో మించి విరాళాలిచ్చాయి. కొన్ని కంపెనీలు నికరలాభాలు, చెల్లించిన ప్రత్యక్ష పన్నులు చూపలేదు. కొత్తగా ఏర్పడిన కొన్ని కంపెనీలు మూడేళ్ల కాలపరిమితి పూర్తికాకుండానే విరాళాలిచ్చాయి. ఇవి ఇతర కంపెనీలకు ముసుగుగా, నకిలీ కంపెనీలుగా ఉపయోగపడి ఉండవచ్చు. మరికొన్ని చిత్రాలేమంటే ఇడి, సిబిఐ, ఐటి కొన్ని కంపెనీలపై దాడులు చేశాయి. అవి బాండ్లుకొని సమర్పించుకున్నాయి. వాటి పనులు మంజూరైనాయి. అంటే అక్రమంగా డబ్బు చేరవేత, క్విడ్ ప్రోకో నిరాకరించలేని వాస్తవాలు. ఈ అక్రమ లబ్ది గూర్చి ఓటర్లు ఆలోచించాలి.

ఎన్నికలు ముగిసిన తదుపరి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఎన్నికల బాండ్‌ల పథకం అమలులో చట్టాల అతిక్రమణ, ఇతర అక్రమాల గూర్చి క్షుణ్ణంగా దర్యాప్తు జరిపించాలి. చట్టాలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులు. అది సాధ్యమైనా కాకపోయినా, వాస్తవమేమిటో తెలుసుకునే హక్కు ప్రజలకుంది. ప్రభుత్వం నుండి ఈ కనీస న్యాయాన్ని ఓటు చేసిన ప్రజలు ఆశించవచ్చా!

# అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం అంబేద్కర్

బాబాసాహెబ్‌గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత దేశ చరిత్రలో ఒక స్మారక వ్యక్తి. భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి నుండి అణగారిన కులాల కోసం సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడే వరకు, భారతీయ సమాజానికి ఆయన చేసిన అపారమైన సేవలను భారతదేశంలో అంబేద్కర్ జయంతిగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న ఆయన జయంతి వేడుకల ద్వారా గౌరవించుకుంటాం...

అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం. అగ్రకుల దురహంకారంపై గొంతెత్తిన స్వరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్. భారతదేశ ప్రజల్లో సమానత్వం కోసం అహర్నిశలు తపించిన కృషీవలుడు అంబేద్కర్. బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాల నుంచి దేశమంతా స్వేచ్ఛావాయువుల కోసం తపిస్తోన్న స్వాతంత్ర్యోద్యమ కాలంలో బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన ధీశాలి. ఆ మహనీయుని 134వ జయంతిని ఇవాళ దేశం మొత్తం జరుపుకుంటోంది.

1891లో ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అంబవాడేలో అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ'అన్న ఊరిలో లో జన్మించారు. దీనిని ఇప్పుడు అంబేద్కర్ నగర్‌గా పిలుస్తారు. (స్వాతంత్ర్యం రావడానికి పూర్వమున్న మహారాష్ట్ర, ఇప్పుడు మధ్య ప్రదేశ్ లో ఉంది) డా.భీమ్ రావ్ అంబేద్కర్ తన తల్లిదండ్రులకు 14వ సంతానం. అందరికంటే చివరివాడు. అతని అసలు ఇంటి పేరు అంబావాడేకర్. అయితే దానిని అతని ఉపాధ్యాయుడు పాఠశాలలో అంబేద్కర్‌గా మార్చారు. చదువుకోవాలన్న., మంచినీళ్ళు తాగాలన్నా కులమే అడ్డుగా నిలబడింది. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. సమాజంలో వర్ణ, వర్గభేదాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. ఎందరికో ఆరాధ్యుడయ్యారు.

'భారతరత్న అంబేద్కర్ భారతదేశానికి లభించిన గొప్ప ఆస్తి. ఆయన ద్వారానే భారతదేశానికి గొప్ప ప్రజాస్వామ్యం అందింది.




భారత రాజ్యాంగం ప్రధాన రూపశిల్పి అంబేద్కర్. భారతదేశంలో దళిత చైతన్యానికి కూడా ఆయన ఎంతో కృషి చేశారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు ఆయన గొంతుగా మారారు. తరతరాలుగా బడుగు, బలహీనవర్గాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా అంబేద్కర్.. వారి అభ్యున్నతకి రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అలాగే అంటరానితనం, అస్పృశ్యతను శిక్షార్హమైన నేరంగా చేశారు. అంతేకాదు ఆర్థికవేత్తగా కూడా ఎంతో గొప్పగా పేరు సంపాదించారు. పారిశ్రామికీకారణ, వ్యవసాయాభివృద్ధి దేశానికి ఊతమిస్తాయని బలంగా నమ్మారు.

అంబేద్కర్ 64 సబ్జెక్టులలో ప్రావీణ్యం సంపాదించారు. ఆయనకు 9 భాషలపై పరిజ్ఞానం ఉంది. దాదాపు 21 సంవత్సరాల పాటు ప్రపంచంలోని అన్ని మతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అంబేద్కర్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో కేవలం 2 సంవత్సరాల 3 నెలల్లో 8 సంవత్సరాల చదువును పూర్తి చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి డాక్టర్ ఆల్ సైన్స్ విలువైన డాక్టరేట్ పట్టా పొందిన ప్రపంచంలోనే మొదటి, ఏకైక వ్యక్తి అంబేద్కర్ కావడం విశేషం. భారతీయ త్రివర్ణ పతాకంపై అశోకచక్ర'కు స్థానం కల్పించిన ఘనత డా.బి.ఆర్ అంబేద్కర్‌కి చెందుతుంది. ఆయన పుస్తకం వెయిటింగ్ ఫర్ ఎ వీసా కొలంబియా విశ్వవిద్యాలయంలో పాఠ్య పుస్తకంగా ఉంది.. ప్రపంచవ్యాప్తంగా ఏ నాయకుడి పేరుతోనైనా అత్యధిక సంఖ్యలో పాటలు, పుస్తకాలు ఉన్నాయంటే అది అంబేద్కర్ మాత్రమే. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథాలయాలలో ఒకటి అయిన లండన్ లైబ్రరీలో అత్యధిక పుస్తకాలను చదివిన వారిలో మొదటి వ్యక్తి ప్రపంచ చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కారల్ మార్క్స్ అయితే, రెండవ వ్యక్తి అంబేద్కర్.

అంబేద్కర్ పార్లమెంట్ సభ్యుడిగా ఎంపికైన తర్వాత వారసత్వ, వివాహ చట్టాలలో లింగ సమానత్వాన్ని వివరించడానికి ప్రయత్నించిన హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను పార్లమెంటులో నిలిపివేయడంతో.. 1951లో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తర్వాత అంబేద్కర్ తన జీవితంలోని ముఖ్యాంశాలను తన ఆత్మకథ 'వెయిటింగ్ ఫర్ ఏ వీసా'లో రాసుకున్నారు. అంబేద్కర్ తీవ్రమైన మధుమేహం వ్యాధితో బాధపడుతూ 1954లో డిసెంబర్ 6న తన ఇంట్లోనే కన్నుమూశారు.

జాజుల దినేష్, 9666238266



# డబుల్ డిజిట్ దక్కేదెవరికి?

తెలంగాణలో ఎండలతో పాటు లోక్‌సభ ఎన్నికల వేడి క్రమంగా పుంజుకుంటున్నది. శాసనసభ ఎన్నికలు పూర్తయిన నాలుగు నెలల తరువాత వస్తున్న ఈ ఎన్నికలపైనే అందరి దృష్టి మళ్ళింది. రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలు మొత్తం 17 స్థానాలలో డబుల్ డిజిట్ దాటాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాయి. బిఆర్ఎస్ ఇప్పటి వరకు ఎన్ని స్థానాలు గెలుస్తామనే లక్ష్యాన్ని విస్పష్టం చేయలేదు. అధికార కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాత్రం 14 స్థానాలపై గెలుపు కోసం ప్రత్యేక ఫోకస్ పెట్టారు. దక్షిణాదిపై కన్నేసిన బిజెపి అందుకు అనుగుణంగా తెలంగాణను తమకు బలం పెంచుకునే అవకాశం ఉన్న రాష్ట్రాలలో ఒకటిగా లెక్కల్లో వేసుకుంటున్నది. అబ్ కీ బార్ చార్ సౌ పార్ (ఈ సారి 400 దాటుతాం) అనే ఎన్నికల నినాదంతో కాషాయ పార్టీ జాతీయ స్థాయిలో భారీ ఆశలను పెట్టుకున్నది. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో కూడా డబుల్ డిజిట్ సీట్లను గెలుపొందాలనే నిర్దేశించుకున్నది. అది ఒక విధంగా కొంత కష్టసాధ్యమైన పనేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎందుకంటే తెలంగాణలో బిజెపికి గరిష్ఠంగా గత ఎన్నికలలోనే నాలుగు స్థానాలు దక్కాయి. అవి సికిందరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్. వాటిలో సికిందరాబాద్ లోక్‌సభ స్థానం 90వ దశకం నుండి సంప్రదాయకంగా బిజెపి ఒకటి లేదా రెండవ స్థానంలో ఉంటుంది. గత ఎనిమిది ఎన్నికలలో ఐదు సార్లు బిజెపి విజయం సాధించగా, మూడు సార్లు కాంగ్రెస్ గెలుపొందింది. బిజెపి తరుపున అత్యధికంగా బండారు దత్తాత్రేయ నాలుగుసార్లు గెలుపొందగా, మొదటిసారి గత ఎన్నికలలో బిజెపి రాష్ట్ర రథసారధి జి.కిషన్ రెడ్డి విజయం సాధించి కేంద్ర క్యాబినెట్ మంత్రి అయ్యారు. మిగతా మూడు సీట్లలో కరీంనగర్ , నిజామాబాద్ ల నుండి ఫైర్ బ్రాండ్‌లు బండి సంజయ, ధర్మపురి అరవింద్‌లు, ఆదిలాబాద్ ఎస్‌టి రిజర్వుడు స్థానం కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరిన సోయం బాపూరావు అనూహ్య విజయం సాధించారు.

ఈ సారి పరిస్థితి గత ఎన్నికల కంటే భిన్నంగా ఉండే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో రెండవ సారి అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్, వెంటనే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఎంఎల్‌ఏలను తమవైపు లాక్కొని, ఆ పార్టీకి ప్రతిపక్ష హోదాను కోల్పోయేలా చేసింది. దీంతో ప్రజలు టిఆర్ఎస్‌కు ఎవరు సరైన ప్రత్యామ్నాయం అనే అంశాన్ని తేల్చుకోలేకపోయారని నాటి లోక్‌సభ ఫలితాలు వెల్లడించాయి. అప్పుడు టిఆర్ఎస్‌కు 9, బిజెపికి 4, కాంగ్రెస్‌కు 3, ఎంఐఎంకు ఒకటి చొప్పున స్థానాలు దక్కాయి. కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న దక్షిణ తెలంగాణలోనే ఆ మూడు సీట్లు దక్కాయి. బిజెపికి సికిందరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణలో మూడు స్థానాలు వచ్చాయి. రెండు, మూడు స్థానాల్లో టిఆర్ఎస్ స్వల్ప మెజారిటీలతో గట్టెక్కింది. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో పోటీ కాంగ్రెస్ వర్సెస్ ఏ పార్టీ అనే దానిపై గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. గత ఎన్నికలలో బిజెపి గెలుపొందిన సికిందరాబాద్ స్థానంలో కాంగ్రెస్ మూడవస్థానంలో నిలిచింది. ఆ స్థానంలో పెద్ద సంఖ్యలో ఉన్న మైనారిటీ ఓటర్లు, ఎంఐఎం తోడ్పాటుతో టిఆర్ఎస్ వైపు మొగ్గుచూపారు. దాంతో రెండవ స్థానం దక్కింది. ఈసారి ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పాటు, మైనారిటీలు ఆ పార్టీ వైపే మళ్ళే అవకాశం ఉన్నది. దీంతో పోటీ బిజెపి , కాంగ్రెస్‌ల మధ్యే నెలకొని ఉన్నది. బిఆర్ఎస్ క్యాడర్ క్రమక్రమంగా కాంగ్రెస్ వైపు మళ్ళుతున్నారు. ఇక ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో బిజెపి సిట్టింగ్ ఎంపిని మార్చింది. ఆ నియోజకవర్గ పరిధిలో అత్యధిక అసెంబ్లీ స్థానాలలో బిజెపి గెలుపొందినప్పటికీ, తరువాత పరిణామాల్లో ఓడిపోయిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున

**రాజధాని సందడి**
– బొమ్మగాని కిరణ్‌కుమార్

కాంగ్రెస్ గూటికి చేరారు. నిజామాబాద్, కరీంనగర్ స్థానాలలో త్రిముఖ పోటీ నెలకొన్నప్పటికీ, కాంగ్రెస్ గతం కంటే పుంజుకొని ధీటైన పోటీలో ఉన్నది. నగర, పట్టణ ప్రాంత నియోజకవర్గాలైన సికిందరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల వంటి స్థానాలతో పాటు మెదక్, జహీరాబాద్, స్థానాలపై ఆశలు పెట్టుకున్నది.

**అంకెలు చెబుతున్నదేమిటి?**

2014లో జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు 66.16 లక్షలు (34.04 శాతం), కాంగ్రెస్ పార్టీకి 48.64 లక్షలు (25.02 శాతం), బిజెపికి 13.67 లక్షలు (7.10 శాతం) ఓట్లు లభించాయి. శాసనసభ , లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరగడంతో రెండు ఎన్నికల్లో ఆయా పార్టీలకు ఇంచు మించుగా ఒకే రకంగా ఓట్లు పోలయ్యాయి. 2018లో జరిగిన శాసనసభ ముందస్తు ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు 97 లక్షల ఓట్లు (46.87 శాతం), కాంగ్రెస్ పార్టీకి 58.83 లక్షల ఓట్లు (28.43 శాతం), బిజెపికి 14.43 లక్షల ఓట్లు (6.98 శాతం) వచ్చాయి. 2019లో వచ్చిన పార్లమెంటు ఎన్నికల్లో అసెంబ్లీకి వచ్చిన ఓట్లలో మార్పు చోటు చేసుకున్నది. టిఆర్ఎస్‌కు ఏకంగా సుమారు 20 లక్షల ఓట్లు తగ్గి, 76.96 లక్షల ఓట్లు (41.29 శాతం), కాంగ్రెస్‌కు 4 లక్షలు తగ్గి 54.69 లక్షలు (29.48 శాతం), బిజెపికి ఏకంగా 22 లక్షల ఓట్లు పెరిగి 36.26 లక్షల ఓట్లు (19.45 శాతం) పోలయ్యాయి. అంటే టిఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికలలో పోలైన ఓట్లు లో తగ్గిన ఓట్లు, బిజెపి వైపు మళ్ళాయి. తాజాగా 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓట్లు 87.53 లక్షలు (37.33 శాతం) ఓట్లు , కాంగ్రెస్‌కు గత శాసనసభ ఎన్నికల కంటే 34 లక్షల ఓట్లు పెరిగి 92.35 లక్షల ఓట్లు (39.40శాతం) లభించాయి. బిజెపి గత పార్లమెంటు ఎన్నికల కంటే సుమారు 4 లక్షల ఓట్లు తగ్గిపోయి 32.57 లక్షల ఓట్లు (13.9 శాతం) పడ్డాయి. దీని ద్వారా అర్థమవుతున్నదేమిటంటే తెలంగాణ ఏర్పాటైనప్పటి నుండి కాంగ్రెస్ పార్టీకి పడే ఓట్లలో పెద్ద తేడా లేకపోగా, క్రమంగా పెరుగుతూ 92.35 లక్షలకు చేరుకున్నది. బిఆర్ఎస్, బిజెపి ఓట్లు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మారుతూ వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల జరిగిన నాలుగు నెలల తరువాత జరుగబోయే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలత ఉండగా, బిఆర్ఎస్ శిబిరంలో మాత్రం తీవ్రంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, జెడ్ పి చైర్మన్‌లు వేగంగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే శాసనసభ ఎన్నికల్లో మైనారిటీలు బిఆర్ఎస్ వైపే నిలిచారనేందుకు జిహెచ్ఎంసి పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా లభించకపోవడమే నిదర్శనం. ఈసారి జాతీయ స్థాయిలో బిజెపి ప్రచార ప్రభావం పెరుగుతుండడంతో తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఉన్న మైనారిటీ ఓట్లు గంపగుత్తగా బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ వైపు మళ్ళుతున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. తొమ్మిదేళ్ళు బిఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచిన ఎంఐఎం సైతం తన వైఖరి మార్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతిస్తామని తెలియజేసింది. బిజెపికి గత పార్లమెంటు ఎన్నికల్లో గరిష్ఠంగా ఓట్లు పోలవ్వగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తరుగుదల కనిపించినప్పటికీ, కొంత మేరకు నిలుపుకోగలిగింది. అయితే, విభజన హామీలను అమలు చేయకపోవడం, పెరిగిన పెట్రోలు , డీజిల్, గ్యాస్ ధరలు, నిరుద్యోగం వంటి అంశాలు ప్రజల్లో వ్యతిరేకత ను నింపాయి. అలాగే గడిచిన పదేళ్ళలో తెలంగాణకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెప్పుకోదగ్గ పనులు చేయకపోగా, గత ఎన్నికల హామీలైన పసుపు బోర్డు ఇంకా కార్యరూపం దాల్చాల్సి ఉన్నది. అదే సమయంలో అయోధ్య రామాలయ ప్రచారం కొన్ని తరగతులను ప్రభావితం చేస్తున్నది. గత పార్లమెంటు ఎన్నికల్లో సారూ.. కారు.. పదహారు అంటూ ప్రచారం చేసుకొని 9 లోక్‌సభ స్థానాలలో గెలుపొందిన బిఆర్ఎస్ ఈ సారి ఎన్ని స్థానాల్లో గెలుస్తామనే విషయాన్ని చూచాయిగా కూడా ప్రకటించుకోలేకపోతుంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం చాప కింద నీరులా తాము కాస్త వెనుకబడిన చోట బలాన్ని పెంచుకుంటూ వేగంగా పావులు కదుపుతున్నది. వచ్చే నెల రోజుల్లో ఎన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో? వాటి ప్రభావం ఎంతో అనే దానిని బట్టి రాష్ట్రంలో ఏ పార్టీకి డబుల్ డిజిట్ సీట్లు దక్కుతాయో తేలుతుంది.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం



**ప్రజాపక్షం / సూర్యాపేట:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డిఎస్‌పి రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో గత నెలలో నిర్వహించిన ఎఎన్‌టిఎస్‌ఓ ఫైన్ లెవెల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొనగా 156 మందికి స్వర్ణ పతకాలు, 258 మంది మెరిట్ సర్టిఫికెట్లు సాధించడం అభినందనీయం అన్నారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక రంగంలో అభిరుచి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహిస్తే ఉత్యుత్తమంగా రాణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిఎం సుధాకర్, కో ఆర్డినేటర్ నాగేందర్, ప్రిన్సిపల్ సతీష్, స్కూల్ డిన్ ప్రవీణ్, ఐపిఎల్ ఇన్ చార్జ్ కెవిఎన్ఆర్, బ్యాచ్ ఇన్ చార్జి మంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువు పూడికతీత పనులు, నర్సరీలను పరిశీలించిన ఎంపిడిఒ




**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** గ్రామీణ ఉపాదిహామీ పథకం కింద మండలంలోని గోగువారిగూడెం గ్రామంలోని చెరువు పూడికతీత పనులను శనివారం ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ సందర్శించి తనిఖీ చేశారు. ఎండ తీవ్రత ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున పని జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు నీడ కోసం షెడ్, తాగునీరు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రతి రోజు 300 రూపాయల వేతనం పడే విధంగా కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. ఉదయం త్వరగా వచ్చి పని చేయాలన్నారు. నీటి సమస్య లేకుండా వ్యవసాయ బోరుబావి నుంచి నీటిని పైపులైన్ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా నీటిని అందిస్తున్న తీరును ఎంపిడిఒ, ఎంపిఒ, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు. అదే విధంగా హరితహారం నర్సరీని పరిశీలించి ఎండిపోయిన మొక్కల స్థానంలో విత్తనాలను వేసి మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ పద్మ, టిఎ రేణుక, ఎఫ్ఎ శ్రీలత ఉన్నారు.

## నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు ఆభరణాలు చోరీ



**ప్రజాపక్షం / ఆత్మకూర్ (ఎం):** మండల కేంద్రంలోని ఇంటి దాబాపై నిద్రిస్తున్న మహిళ మెడ నుండి సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మేకపోతుల కొమురయ్య చిన్న కుమారుడు మేకపోతుల స్వామి భార్య న ర్మద ఇద్దరు పిల్లలతో గ్రామంలో జరుగుతున్న బంధువుల పండుగకు హాజ రై తిరిగి ఇంటికి వచ్చి మేడపైన నిద్రిస్తుండగా మెడలో ఉన్న మూడు తులా ల బంగారు పుస్తెలతాడు, మూడు తులాల నల్లపూసల దండ దొంగలు ఎత్తుకెళ్లారని వారు తెలిపారు. స్వామి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చౌటుప్పల్ ఎసిపి మధుసూదన్ రెడ్డి, స్థానిక ఎస్సై నాగరాజు సందర్శించి పరిశీలించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎసిపి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

## ప్రభుత్వ బాలుర హాస్టల్లో విద్యార్థులకు అస్వస్థత

### ఇద్దరికి సీరియస్, హైదరాబాదుకు తరలింపు

**ప్రజాపక్షం / భువనగిరి:** హాస్టల్ విద్యార్థులు అస్వస్థకు గురై 48 గంటలు గడిచిన అధికారులు వ్యవహరించిన తీరు విద్యార్థులు తల్లిదండ్రులు ఆలస్యంగా వెలుగు చూసింది. హాస్టల్లో చదువుకున్న విద్యార్థుల గత గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో తీవ్ర కడుపునొప్పితో వాంతులు విరేచనాలు అధికంగా కావడంతో విద్యార్థులు నీరసంగా మారి పడిపోవడంతో అది గమనించిన తోటి విద్యార్థులు స్థానిక ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వగా గోప్యంగా అప్రమత్తమయ్యారు. 8 మంది విద్యార్థులు స్వల్పంగా అస్వస్థతకు గురికాగా ఇద్దరు విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎలాంటి మీడియాకు అధికారులకు సమాచారం ఇవ్వకపోగా ఇద్దరు విద్యార్థులను హైదరాబాదుకు తరలించి వైద్యం అందిస్తున్నట్లు తెలిసింది తెలిపారు. 420 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. విద్యార్థులు ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యము కోసము తరలించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.

## జిల్లాలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



**ప్రజాపక్షం / నల్లగొండ :** పార్లమెంటు ఎన్నికలు, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి పండుగల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలకు విఘాతం పాల్పడే చర్యలు తప్పవు అని జిల్లా ఎస్ పి చందన దీప్తి అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 354 కేసులలో 693 మంది పాత నేరస్తులు, రౌడీ షీటర్‌లలో 80 మంది ముఖ్యమైన రౌడీ షిటర్లకు పిలిపించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా, ఇతర నేరాలకు పాల్పడకుండా ఉండాలని కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. జిల్లా పరిధిలో రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసుల నిఘాలో ఉన్నాయని, చట్ట వ్యతిరేక కార్యలాపాలకు పాల్పడితే చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. ప్రతి ఒక్కరి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామని అన్నారు. ఎవరైన బైండవర్‌ను ఉల్లంఘించి మళ్ళీ నేరాలకు పాల్పడితే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ నమోదు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, తమ పాత పద్ధతులను వదులుకొని సత్ప్రవర్తనతో మంచిగా మారి ఎలాంటి నేరాలు చేయకుండా సమాజాభివృద్ధికి దోహద పడినట్లయితే, వారిపై ఉన్న రౌడీ సీట్లు తొలగించడానికి కృషి చేస్తామని అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికలలో జిల్లా పరిధిలో గల రౌడీ షీటర్‌లు ఎటువంటి అలజడి సృష్టించకుండా మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేస్తామన్నారు.

# మద్దతుకు మించి మార్కెట్ ధర



సన్నరకం ధాన్యానికి భారీ డిమాండ్

**ప్రజాపక్షం / సూర్యాపేట ప్రతినిధి:** వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి మార్కెట్ ధర పలుకుతుంది. సన్నరకం ధాన్యాన్నికి భారీ డిమాండ్ పెరగడంతో మిల్లర్లు, వ్యాపారులు రైతుల నుండి ధాన్యాన్ని పోటీపడి కొంటున్నారు. దీంతో ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతన్న ముఖంలో ఆనందం వ్యక్తమవుతుంది. వరి ధాన్యాన్నికి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు ఏ–గ్రేడ్‌కు రూ. 2203లు, బి–గ్రేడ్‌కు రూ. 2183లుగా ప్రకటించింది. మద్దతు ధరకు మించి సన్నరకం ధాన్యానికి మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుంది. ఈ రబీ సీజన్‌లో రైతులు జిల్లా వ్యాప్తంగా 385459 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా 3.55 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని అధికారులు అంచనా వేశారు. గత ప్రభుత్వం రైతులు సన్నాలను ఎక్కువగా సాగు చేయవద్దని దొడ్డురకం ధాన్యంను పండించాలంటూ సూచనలు చేయడంతో రైతులు ఎక్కువగా దొడ్డురకం పంటను సాగు చేశారు. దీంతో జిల్లాలో సన్నరకం ధాన్యం సాగు సగానికి పడిపోయింది. ఈ క్రమంలో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. సామాన్యుడి నుండి మొదలుకొని ధనవంతుల వరకు సన్నరకం బియ్యాన్ని అత్యధికంగా వినియోగిస్తుండడంతో ఉత్పత్తి తగ్గి డిమాండ్ పెరిగిందన్నది స్పష్టమవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో సన్నరకం బియ్యం ధర క్వింటాకు రూ. 5600 నుండి 6వేలకుపైగా పలుకుతుండడంతో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా ఎక్కువ ధర పలుకుతుంది. సన్నకరం ధాన్యానికి భారీగా డిమాండ్ పెరిగింది. సన్నరకాలైన జై శ్రీరాం, హెచ్ఎంటి, ఎన్ఎల్ఆర్, ఐఆర్ 64 రకం ధాన్యం క్వింటాకు రూ. 2400ల నుండి 2700లకు పైగా ధర పలుకుతుంది. సన్నరకం వరి ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్స్ యజమానులు రా రైస్ కోసం 20శాతంకు పైగా తేమశాతం ఉన్న ధాన్యాన్ని పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో స్టీం రైస్ చేసే ఇండస్ట్రీలు నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని రైతాంగం తమ సన్న ధాన్యాన్ని అక్కడికి తరలించి మిల్లర్లకు అమ్ముతున్నారు. కొంత మంది వ్యాపారులు రైతుల కళ్లాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో కూడా రూ. 2500 నుండి 2600 వరకు ధర పలుకుతుంది. సన్నరకం ధాన్యానికి ధర మద్దతుకు మించి మార్కెట్‌లో డిమాండ్ పలుకుతుండడంతో రైతన్న ముఖంలో ఆనందం వెల్లువిరుస్తుంది. ఈ సన్నాల్ల ధర రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

## హక్కులు సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం / రామన్నపేట:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని హక్కులను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ప్రదీప్ అన్నారు. శనివారం మండలంలోని జనంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కుల ప్రకారం ప్రతి భారతీయుడు చదువుకునే అవకాశం కల్పించారని అన్నారు. బాలికలకు ఉచిత విద్య అందించాలని నిర్ణయించారని, దాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే పుస్తకాలతోపాటు దేశ నాయకుల జీవిత చరిత్రను, కరెంట్ ఎఫైర్, జనరల్ నాలెడ్జ్ లాంటి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి.మజీద్, వైస్ ప్రెసిడెంట్ లింగయ్య, ప్యానల్, రిటైనర్ న్యాయవాదులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్మిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణనష్టం జరగకుండా చూసుకోవాలి

### ఫుడ్ పాయిజన్‌కి కారణమైన వారిని సస్పెండ్ చేయాలి: ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం / భువనగిరి రూరల్:** గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి కారణమైన ప్రిన్సిపాల్, కేర్ సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో గత రెండు రోజులుగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ జరిగి విపరీతమైన వాంతులు విరోచనాలతో బాధపడుతున్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన విషయాన్ని సంబంధిత ప్రిన్సిపల్ గోప్యంగా ఉంచి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. గత రెండు రోజులుగా భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో ఏడుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై చికిత్స తీసుకుంటున్నట్లుగా తెలిసిందని ఒక విద్యార్థికి విషమంగా ఉండడంతో నీలోఫర్ హాస్పిటల్‌కి తరలించారని పరిస్థితి ఇంత విషమంగా ఉన్నప్పటికీ సంబంధిత ప్రిన్సిపాల్, రీజనల్ కోఆర్డినేటర్‌తో మాట్లాడడానికి ప్రయత్నం చేసిన ప్రిన్సిపాల్ ఫోను స్విచ్ ఆఫ్ చేసుకోవడం జరిగిందని, ఆర్‌సిఓతో మాట్లాడుతూ గత సంవత్సరం మన యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూర్ మండల కేంద్రంలో కూడా 20 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగి ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేస్తూ ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మరియు ఫుడ్ పాయిజన్ కారణమైన కేర్ సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేశారు. నిత్యం గురుకుల పాఠశాలల్లో సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ గురై విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఇకనైనా జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ హాస్టల్లో గురుకుల పాఠశాల లపైన సంబంధిత అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధికి చిరునామా కాంగ్రెస్

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం / యాదగిరిగుట్ట:** సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఏ పార్టీ పోటీ కాదని భువనగిరి ఖిలా పై కాంగ్రెస్ జండా ఎగరడం ఖాయమని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలలో భాగంగా భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఆలేరు నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. భువనగిరి పార్లమెంటు పరిశీలకులు, ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ సమావేశానికి ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అప్పుల ఊబిలో ముంచిన బిఆర్ఎస్ పార్టీ కనుమరుగు కాకతప్పదని అన్నారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాకారాన్ని నెరవేర్చిన సోనియమ్మకు మనమంతా ఋణపడి ఉండాలని సూచించారు. నూతన ప్రభుత్వంలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేసుకున్నామని త్వరలో మిగిలిన ఒక్క గ్యారెంటీని కూడా అమలు చేస్తామన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్లమెంటు ఎన్నికలలో భువనగిరి ఎంపిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహా సముద్రమని సబ్బండ వర్గాలకు, కుల మత ప్రాంత భేదాలు లేని చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. సమన్వయంతో కలిసిపోయి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భువనగిరి ప్రాంతం అభివృద్ధికి తన వంతు కృషి చేయడానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. భువనగిరి పార్లమెంటు పరిశీలకులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆలేరు ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత తీసుకుని నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. భువనగిరి కాంగ్రెస్ పార్టీ అడ్డా అని యూత్ కాంగ్రెస్ లో 20 సంవత్సరాల నుంచి ఏ పదవి లేకుండా ఎన్ఎస్‌యుఐ కష్టపడిన యువకుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గుర్తించి టికెట్ ఇచ్చిందని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిపిసిసి కార్యదర్శులు జనగాం ఉపేందర్ రెడ్డి, బాల లక్ష్మి , మాజీ మంత్రి సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, ఎస్‌టిసెల్ అధ్యక్షులు రాంజీ నాయక్, 8 మండలాల అధ్యక్షులు ఎంపిపి జడ్పిటిసిలు, మున్సిపల్ చైర్మన్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏదుల నుండి డిండి ప్రాజెక్టుకు నీళ్లు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం / దేవరకొండ:** ఏదుల నుండి డిండి ప్రాజెక్టులోకి నీటిని పంపింగ్‌చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందిస్తామని, ఎస్ఎల్‌బిసి, నక్కలగండి టన్నెల్, డిండి ప్రాజెక్టుతో పాటు నియోజకవర్గంలోని పెద్దమునిగల్, కంబాలపల్లి, పొగిళ్ళ, పెద్దగట్టు, అక్కంపల్లి, గాజుపేట, చిత్రియాల లిఫ్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో జరిగిన నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపుకై నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఆర్భాటంగా లిఫ్టులు శంకుస్థాపనలు చేశారు తప్పా నిధులు కేటాయించి పూర్తి చేయలేదని అన్నారు. నియోజకవర్గంలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాంపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పది వేల ఇందిరమ్మ ఇండ్లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి దేవరకొండలో ప్రారంభించారని నాటి ఇందిరమ్మ ఇండ్లే నేటికి దర్శనమిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ హాయాంలో ఏ ఒక్కరికి ఇండ్లు కేటాయించకుండా మాయమాటలతో కాలం గడిపారని అన్నారు. ఎంపిగా పార్లమెంట్‌లో కొట్లాడి గిరిజనులకు రిజర్వేషన్లు పెం చే విధంగా బిఆర్ఎస్ పై ఒత్తిడి తెచ్చానని ఆయన గుర్తు చేశారు. ప్రజా పాలనలో మంత్రులంతా ఏకతాటిపై టీంగా పనిచేస్తున్నామని రైతులకు ఎంఎస్‌పి ధర కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ రాకుండా చూస్తామని ఆయన అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషాన్ని ఇచ్చిందని, రాష్ట్రంతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయడమే ధ్యేయం అని ఆయన అన్నారు. ఎస్ఎల్ బిసి టన్నెల్, డిండి లిఫ్ట్ సమీక్షిస్తున్నామని కాంగ్రెస్ మాట ఇస్తే తప్పే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు ఇప్పటికే రెండున్నర సంవత్సరాలలో ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, దేవరకొండ నియోజకవర్గంలో అతిపెద్ద ప్రాజెక్టులైన ఎస్ఎల్‌బిసి, నక్కలగండి లిఫ్ట్, డిండి ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తే జీవితాంతం కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని బాలునాయక్ అన్నారు. 100 కోట్లతో డిండి ప్రాజెక్టు పనులకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, నాగార్జున సాగర్ ఎంఎల్ఏ కుందూరు జైవీర్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్‌నాయక్, పిఏసిఎస్ చైర్మన్‌లు, ఎంపిపిలు, జెడ్పిటిసి, మునిసిపల్ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలులో

# అలసత్వం వహించరాదు



**ప్రజాపక్షం / సూర్యాపేట రూరల్ / పెన్‌పహడ్:** ధాన్యం కొనుగోలులో నిర్వహకుల అసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శనివారం సూర్యాపేట రూరల్ మండల పరిధిలోని ఇమాంపేట, పెన్‌పహడ్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి వసతులు, ధాన్యం కొనుగోళ్లు, రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. 24 గంటల పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియను సంబంధిత శాఖ అధికారులతో కలిసి మానిటరింగ్ కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 295 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తామని, కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా సాఫీగా కొనసాగించి రైతులకు మద్దతు ధరను అందించాలన్నారు. ధాన్యం అమ్మకాలపై ఎక్కడైన సమస్య ఏర్పడితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను నిర్వహకులు సంప్రదించాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టిన, మద్దతు ధర ఇవ్వకున్నా చర్యలు తీసుకుంటామన్నారు. ఐకెపి, పిఎసిఎస మెప్మా కేంద్రాల నిర్వహకులు బాధ్యతయుతంగా రైతులకు సేవలు అందించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతా, డిఎస్ఓ మోహన్ బాబు, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, మార్కెటింగ్ డిఎం శర్మ తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో వైన్‌షాప్ దగ్ధం



దాదాపు 50 లక్షల నష్టం

**ప్రజాపక్షం / శాలిగౌరారం:** నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల కేంద్రంలోని శ్రీదేవి వైన్స్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లక్షల రూపాయల ఆస్తి నష్టం అయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండల కేంద్రంలోని గురజాల రోడ్డులో ఉన్న శ్రీదేవి వైన్స్ షాప్ నెంబర్ 105 లో శుక్రవారం రాత్రి 10 గంటలకు నిర్వాహకుడు బట్ట సైదులు వైన్స్ షాపు బంద్ చేసి వెళ్లిపోయారు.అర్ధ రాత్రి 12 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ప్రక్కన ఉన్న ఇంటి యజమాని కల్లూరి యల్లయ్య గమనించారు.వెంటనే షాప్ నిర్వాహకులకు సమాచారం అందించారు.హుటాహుటిన వచ్చి షాప్ నిర్వాహకుడు విద్యుత్ సరఫరా బంద్ చేయించారు. అనంతరం 100 కాల్ చేశారు. స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి మంటలు చల్లా ర్పడానికి ప్రయత్నం చేసిన మంటలు అదుపులోకి రాకపోవడంతో నకిరేకల్ నుంచి ఫైర్ ఇంజన్ తెప్పించి మంటలు చల్లార్చారు.అప్పటికే విలువైన మద్యం సామాగ్రి మంటలకు అహుతి అయ్యింది. దీనికంతటికి కారణం ఫ్రిడ్జిల వద్ద విద్యుత్ వైర్లు సర్క్యూట్ కావడం వల్లే షాప్ దగ్ధమైనట్లు గుర్తించారు.షాప్ దగ్ధం కావడం వల్ల షాప్లోని దాదాపు 50వేల నగదు,3 పెద్ద ఫ్రిడ్జిలు, ఇన్వర్టర్ బ్యాటరీలు, 71 కాటన్ల లిక్కర్,15 పెట్టల బీర్లు, కౌంటర్ మిషన్, క్యాష్ కౌంటర్, 8సీసీ కెమెరాలు, 3 ర్యాకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు వీటి విలువ 50 లక్షల వరకు నష్టం జరిగినట్లు షాప్ నిర్వాహకుడు బట్ట సైదులు శాలిగౌరారం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశాడు.సంఘటన స్థలాన్ని శాలిగౌరారం ఎస్ఐ వాసా ప్రవీణ్ కుమార్, ఎక్సయిజ్ ఎస్ఐ భాను ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

### కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి:** రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కచ్చితంగా ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సూచించారు. శనివారం కొత్తపల్లి మండలం మల్కాపూర్, బద్దిపెల్లి గ్రామాలలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సరైన తేమ శాతం వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తరుగు, తేమ పేరిట ధాన్యానికి ఎలాంటి కోత విధించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్‌మిల్లర్లు సైతం ధాన్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని అన్నారు. ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. హమాలీలు,తాగునీరు, విశ్రాంతికి నీడ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లర్లకు నాణ్యమైన గన్నీ బ్యాగులు అందించాలని సూచించారు. మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, డిప్యూట్ తహసీల్దార్ సురేందర్, ఆర్ఐ అరుణ్, తదితరులున్నారు.

# పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి




**ప్రజాపక్షం / ఆలేరు :** దళితులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో కుట్ర కేసులు పెట్టి దళితులను అనేకంగా హింసిస్తూ బాధపడుతున్న పరిస్థితి ఏర్పడిందని అందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దతించే విధంగా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో దళిత కుల పోరాట సమితి అధ్యక్షులు ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం దళితులకు దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ కింద లోన్స్, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, సాగు చేయడానికి సాగు భూములు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కిష్టయ్య, లక్ష్మి , సరళ, నీలమ్మ, మల్లయ్య, శంకర్, జానమ్మ, ప్రవీణ్, నాగమణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

### అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావిణ్య

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలలో వాల్ పోస్టర్‌ను శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి భవవాన్‌రెడ్డి, సహాయ అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు రవీందర్, నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు చూడాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఏటూరునాగారం ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రా, భద్రాచలం ఎ ఎస్పీ, ట్రైనీ ఎస్పీ లతో కలిసి సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా ప్రతి పోలింగ్ కేంద్రాలలో, కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులైన కరెంటు, ర్యాంపులు, టాయిలెట్లు, త్రాగునీరు తదితర పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల పై దృష్టి పెట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎన్నికలు సాఫీగా సాగేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ లు అలివేలు, నరసింహారావు, ఎ.ఆర్.ఓలు, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

**ప్రజాపక్షం/గీసుకొండ:** వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈనెల 26న అబ్బని కుంటలోని జిల్లా కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సు జరుగుతుందని నలుమూలల నుంచి వచ్చి జయప్రదం చేయాలన్నారు. శనివారం గీసుకొండ మండల కమిటీ సమావేశం కోనాయిమాకులలో మండలాధ్యక్షుడు మోగిడె పీరయ్య అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా 26న జరిగే జిల్లా సదస్సు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలు ఏమాత్రం రైతాంగాన్ని ఆదుకునే విధంగా లేవన్నారు. రైతాంగం ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ గిట్టుబాటు ధర చట్టం కోసం చేస్తున్న పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అణిచివేయడం దారుణమన్నారు. వ్యవసాయానికి నష్టం చేకూర్చే విద్యుత్ సవరణ బిల్లును వెంటనే విరమించుకోవాలన్నారు. కౌలు రైతులు కష్టపడి చేస్తున్నప్పటికీ వారిని ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతోపాటు రైతు భరోసా, పంట రుణాల సౌకర్యం కల్పించాలన్నారు. కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా వెంటనే విత్తన చట్టాన్ని వెంటనే తీసుకరావాలన్నారు. జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథులుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ యాదగిరి చార్యులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా కమిటీ సభ్యుడు తిప్పారపు రాజు, మండల కమిటీ సభ్యులు లాడె సమ్మారావు, శంకర్‌రావు, బరపటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య



**ప్రజాపక్షం/కొండపాక :** అప్పుల బాధతో క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య కుకునూరుపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది.కుకునూరుపల్లి ఎస్ఐ పి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం మండల కేంద్రానికి చెందిన పాల పరమేశ్వర్ గౌడ్ బ్యాంకు లోన్ తీసుకొని, తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టారు.కాలం సరిగా కాక పంటలు పండకపోవడంతో గత కొద్ది రోజుల నుండి అప్పులు ఎలా తీర్చాలని మదనపడి, ఈ నేల 7వ తేదీన వ్యవసాయ పోలం దగ్గరకు వెళ్ళి వస్తానని చెప్పి సాయంత్రం ఇంటికి వచ్చి అస్వస్థకు గురై వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్ష చేసి తన పరిస్థితి విషమంగా ఉందని తెలుపగా మెరుగైన వైద్యం కోసం ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఆర్ విఎం ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి

### ఎఐసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామిగౌడ్



**ప్రజాపక్షం/సంగెం:** వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎఐసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామిగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాలులో మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తత స్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా కత్తి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు ప్రభుత్వంలో ఉండి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. అభివృద్ధిని మర్చి అవినీతి పరిపాలన సాగించడం వల్ల అసెంబ్లీ ఎన్నికలు కెసిఆర్‌ను ఫాంహౌజ్‌కు పంపించాయన్నారు. బిఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మోడీ నిరుద్యోగులకు ప్రతీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన మోడీని పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. మరోసారి మోడీ ప్రధానమంత్రి అయితే భారత రాజ్యాంగాన్ని మారుస్తారని, అలాంటి మోడీని పార్లమెంటు ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. బీజేపీ ప్రతీ ఎన్నికల్లో మతాలు, కులాల మధ్య విద్వేషాలు సృష్టించి ఓట్లు దండుకుంటుందన్నారు. దేశ సంపదను ఆదాని, అంబాని, లలిత్ మోడీలతోపాటు కార్పోరేట్ నేరస్థుల చేతుల్లో పెడుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీకి ఓటమి భయం పట్టుకుందని అందుకే ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐలను వాడుతున్నారన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కళావతి, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధులు జనగాం రమేశ్‌గౌడ్, చాడ కొమురారెడ్డి, జనార్ధన్, మెట్టుపల్లి రమేశ్, ఏపీఆర్, పులి సాంబయ్యతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటా

### ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతీ ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్.నాగరాజు అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నుంచి సుమారు వందమందికి పైగా 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, బాలాజీ నగర్ సీనియర్ నాయకులు పత్రి సుభాష్, పస్తం శంకర్‌ల ఆధ్వర్యంలో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ కండువాలను కప్పుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కెఆర్.నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా ఉంటూ వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, బుచ్చిరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, పురాణం రవి, షేక్ జావేద్, పైసా మహేశ్, పత్తి కుమార్, చోటు, బబ్బులు, యూసుఫ్, గూడూరు కృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో కోతలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ధాన్యం కొనుగోళ్లలో కోతలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ హెచ్చరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అన్ని మండలాల రైస్‌మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గన్నీ బ్యాగులు, తేమ మిషన్లు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడా ధాన్యం కొనుగోళ్లతో తరుగు తీయరాదని, రైస్ మిల్లర్లు సకాలంలో ఎఫ్‌సిఐ కి వానాకాలం బియ్యాన్ని అప్పగించాన్రాను. ప్రతి కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు పంపించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికి అప్పుడు షిఫ్టింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిఎస్ఓ రోజారాణి, డిఎం సివిఎస్ ప్రసాద్, డిటి శ్రీనివాస్ దేవా తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/కమలాపూర్ :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కమలాపూర్ మండల కేంద్రంతోపాటు అంబాల, గూడూరు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు వద్ద రైతులకు గన్ని బస్తాలు, ఇతర ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాధవి, సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్ రావు, ఆయా గ్రామాల ఎంపిటిసిలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా విష్ణువర్దన్



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హన్మకొండలోని నయింనగర్‌కు చెందిన కాకతీయ విశ్వ విద్యాలయ ఉద్యోగి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వ బ్రాహ్మణ విశ్మకర్మ సంఘీయుల ఔన్నత్యాన్ని పెంపొదించడంలో విశేష కృషి చేయడంతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం కార్యవర్గంలో చర్చించిన అనంతరం పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. విష్ణువర్దన్ ప్రస్తుతం విశ్వ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(వోపా) వరంగల్ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షునిగా, విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం హన్మకొండ జిల్లా కోశాధికారిగా పనిచేస్తున్నారు. నాపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర నాయకత్వానికి విష్ణువర్దన్ కృతజ్ఞతలు తెలిపారు. విశ్వ బ్రాహ్మణ జాతీయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, సంక్షేమం విషయంలో తన వంతు కృషి చేస్తానని విష్ణువర్దన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, కుల బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



## సంఘవిద్రోహశక్తులపై నిఘా

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డ్స్ ,కేసుల పురోగతి పరిశీలించారు. సిబ్బందితో మాట్లా డుతూ రాబోయే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, సంఘ విద్రోహ శక్తుల పైన నిఘా ఉంచాలని, తరుచుగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తదుపరి సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ ఇసుక రవాణా మీద కఠిన చర్యలు తీసుకుంటా మని,ఎవరైనా పోలీస్ వారి ఆదేశాలు ధిక్కరిస్తే కేసులు నమోదు చేసి జైల్ కి పంపిస్తామని,తీరు మార్చుకోకుంటే పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. మానేరు వాగులోనూ ఇసుక అక్రమ రవాణా చేసే అవకాశం వున్న స్థలాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సై ప్రసాద్ కు సూచనలు చేశారు. ఎస్‌పి వెంట భూపాలపల్లి డిఎస్‌పి సంపత్‌రావు, చిట్యాల సిఐ మల్లేశ్ వున్నారు.

## గతం మరిచి మాట్లాడుతున్న మంత్రి

### నాపై చేసిన ఆరోపణలు అవాస్తవం
### కాంగ్రెస్, బిజెపి రహస్య ఒప్పందాలు
### ఎమ్మెల్యే సునీత రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** పూటకో పార్టీ మార్చిన గతాన్ని మరిచిపోయిన మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. శనివారం ఆమె నర్సాపూర్ పట్టణంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తను కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సమయంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని అన్నారు. తనకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి అవమానపరిచిన తర్వాతే తను టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. తను టిఆర్ఎస్ పార్టీలో చేరిన సమయంలో ఎటువంటి పార్టీ పదవి కూడా లేదని అన్నారు. మంత్రి కొండ సురేఖ తనను విమర్శించే ముందు ఎన్ని పార్టీలు మారారో ఆత్మ విమర్శన చేసుకోవాలని అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే బిజెపి పార్టీకి వేసినట్లు అని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం తగదన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీ లు రహస్య ఒప్పందాలు పెట్టుకున్నాయని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధానమంత్రి తో కలిసి మీరు బడా బాయ్, రాష్ట్రంలో నేను చోట బాయ్.కానీ తెలిపారు అందువల్లే కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓడిపోయిన అభ్యర్థిని తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం టిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి, ఆయన సొంత నిధులతో జిల్లా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈనెల 16న బహిరంగ సభ చౌటకూర్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ బహిరంగ సభకు నర్సాపూర్, పటాన్ చెరువు, సంగారెడ్డి, నియోజకవర్గంలోని టిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, సూరారం నర్సింలు, ఆంజనేయులు గౌడ్, కొన్యాల నరసింహారెడ్డి, రింగుల ప్రసాద్, జ్ఞానేశ్వర్, కొండి కుమార్, అశోక్ మానయ్య తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి

## సైనికుల్లా కృషి చేయాలి

### ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు సైనికుల్లా కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్వినీ రెడ్డి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఇటీవల మహబాదు జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తొర్రూరు పట్టణానికి చెందిన బసనబోయిన రాజేష్ యాదవ్ నియామకం అయిన సందర్భంగా శనివారం రాజేష్ యాదవ్‌ను శాలువా కప్పి సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ యశస్వినీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుల్లా కృషి చేయాలని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక పాలనను సాగిస్తున్నదని, అదే విధంగా పార్టీ నాయకులను సరైన సమయంలో వివిధ పదవులతో నింపడం జరుగుతుందని, ఎవరూ కూడా నిరుత్సాహానికి గురికావద్దన్నారు. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు తావు లేకుండా చేయాలని, ఇంటింటికి కాంగ్రెస్ పథకాలను చేరే విధంగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న ఎంపి ఎన్నికలలో పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సుంచు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరకు ఎంఎల్‌సిగా అవకాశం?

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లతో స్టేషన్‌ఘనపూర్ నుండి ఓడిపోయిన సింగపురం ఇందిరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంఎల్‌సి పదవి ఇస్తామని హామి ఇచ్చినట్లు తెలుస్తోంది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు మంత్రి కొండా సురేఖతో కలిసి సింగపురం ఇందిర, స్టేషన్‌ఘనపూర్ ఎంఎల్‌ఎ కడియం శ్రీహరిలు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సింగపురం ఇందిరను పార్లమెంట్ ఎన్నికల్లో కావ్యను గెలిపించాలని ఆదేశించినట్లు సమాచారం. అదే విధంగా ప్రభుత్వంలో మంచి పదవిలో ఉంటావని హామి ఇచ్చారు. అయితే సింగపురం ఇందిర రెండు పర్యాయాలు స్టేషన్‌ఘనపూర్ నుండి పోటీ చేసి ఓడిపోయారు. వరంగల్ పార్లమెంట్ టిక్కెట్టు ఆశించారు. ఇందిరకు కాంగ్రెస్‌లోని పెద్దల ఆశిస్సులు ఉన్నాయి. అనూహ్యంగా కడియం కావ్య తెరమీదకు రావడం, టిక్కెట్టు ఇవ్వడంతో ఇందిర అలిగారు. పార్టీ క్యాడర్‌లో ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ వర్గాలు ఇందిరతో స్వ యంగా మాట్లాడాయి. ఆ తరువాత కావ్య గెలుపుకోసం తిరుగుతున్నారు. మరింతగా కష్టపడవల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి పిలుపు మేరకు ఇందిర కలిశారు. ఈ సందర్భంగా తాను పడిన కష్టాన్ని ముఖ్యమంత్రికి చెప్పినట్లు సమాచారం. నీకు, కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకుంటామని, మంచి పదవిలోనే ఉంటావని హామి ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎంపి టిక్కెట్టు ఆశించిన బంగపడిన ఇందిర ఎంఎల్‌సి ఆశిస్తుండగా త్వరలోనే ఆ కోరిక నెరవేరే అవకాశం ఉంది.



## పథకాలన్నీ అమలు చేస్తాం

### బిఆర్‌ఎస్‌వన్నీ అసత్య ఆరోపణలు
### టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని, బిఆర్‌ఎస్‌వి అసత్యపు ఆరోపణలు అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడారు. బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కలెక్టర్ ఉద్యోగం సంపాదించానని చెప్పుతున్న, చదువుకున్న సంస్కరం ముఖ్యమంత్రి మంత్రుల ఎమ్మెల్యేల కాళ్లు మొక్కలని ఏ సర్వీసుల రూల్లో రాసి ఉందో చెప్పాలని వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ప్రజలు ఎంతో ఆకాంక్షతో ప్రభుత్వ అధికారుల మీద నమ్మకం పెట్టుకుంటారని, ప్రభుత్వ ఉద్యోగులు మంత్రులకు ఎమ్మెల్యేలకు తొత్తులుగా మారి ఆస్తులు కూడపెడుతున్న వైనం మన జిల్లాలో చూస్తామన్నారు. సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి రైతుల పొట్టగొట్టి వారి భూములను తక్కువ ధరకు లాక్కొని రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ , ప్రాజెక్టల వల్ల ఎవరికి ఎంత ఉపయోగమైందో సిద్దిపేట ప్రజలకు యావత్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలకు తెలుసన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుని భారీ మెజారిటితో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆవుసుల మల్లేష్‌చారి, నాయకులు నరేందర్‌రెడ్డి, సోసైటి డైరెక్టర్ కిష్టగౌడ్, జగ్గ శంకర్‌గౌడ్, దుర్గాగౌడ్, సుధాకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌యాదవ్, మల్లేశం పాల్గొన్నారు.

## 20 లీటర్ల నాటు సారా స్వాధీనం

### 600 లీటర్ల బెల్లం ఊట నిర్మూలన



**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** ములుగు జిల్లా మంగపేట బోర్ నర్సాపూర్ గ్రామంలో ఏటూరు నాగారం ఎక్సైజ్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో దాడులు శనివారం నిర్వహించి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల చక్కెర పానకంను ధ్వంసం చేసి ధారావత్ రాంబాబు, భూక్య సంపత్, షేక్ షమీనా ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తిరుపతి, నాగరాజు, నవీన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## కులగణన లేకుండా రిజర్వేషన్లు అమలుకావు

బిఆర్ఎస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ముదిగొండ:** దేశంలో కులగణన చేయకుండా రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని బిఆర్ఎస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన ముదిగొండలో జరిగిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు...దేశంలో కులగణన చేయాలని చిత్తశుద్ధి బిజెపి ప్రభుత్వంకు లేదని, తాను ఎంపిగా గెలిస్తే కులగణనతో పాటు బిసి,మ హిళా రిజర్వేషన్ల ప్రక్రియ కోసం పోరాడతామని ఆయన అన్నారు. దేశంలో బిసి మంత్రిత్వశాఖ లేకుండా చేసిన ఘనత బిజెపి ప్రభుత్వంకు దక్కుతుంది అని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా మాట్లాడే నాయకులపై ఐటి, ఇడి, సిబిఐలతో దాడులు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ...కులగణన జరగకుండా మహిళా, బిసి రిజర్వేషన్స్ అమలు సాధ్యం కాదన్నారు. బలమైన నాయకులు నామా నాగేశ్వరరావును తిరిగి గెలిపించి పార్లమెంటులో ఉంటేనే మహిళా, బిసి రిజర్వేషన్స్ అమలు కావడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాత మధు, మాజీ ఎంఎల్ఎ కోటేశ్వరరావు, జెడ్‌పి చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపిపి సామినేని హరిప్రసాద్, నాయకులు కొండవల కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, పోట్ల ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు ఉన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్నూరుకాపు సంఘ నాయకులు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో మర్యాదపూర్వకంగా కలిసి మున్నూరుకాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా జగిత్యాల మున్నూరు కాపు సంఘ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పూలమొక్క అందజేసి శాలువాతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంఘ నాయకులు వర్తక వ్యాపారుల సంఘం 2024 డైరీని సిఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్నూరు కాపు సంఘ నాయకులు బండారి రాజ్‌కుమార్, దీటి అంజయ్య పటేల్, అంగలి రాజన్న పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్



**ప్రజాపక్షం/నస్పూర్ :** నస్పూర్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తాగునీటి సమస్యపై సమావేశం నిర్వహించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా నస్పూర్ పట్టణ ప్రాంత ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని పేర్కొన్నారు. 25 వార్డులకు సంబంధించిన వార్డ్ ఇంచార్జ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డులలో పైప్ లైన్ లీకేజీ, ట్యాప్ కనెక్షన్ల ఇబ్బందులతో ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఒకవేళ ఇబ్బంది ఉన్నట్లయితే పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పనిచేయని నిఘా నేత్రాలు



**ప్రజాపక్షం/ముధోల్ :** మండల కేంద్రమైన ముధోల్‌లోని ప్రధాన కూడల్ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు గత కొన్ని రోజులుగా పనిచేయక అంధత్వంగా మారాయి. నేరాలను నియంత్రించే ధ్యేయంతో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని పోలీస్‌లు గ్రామస్తుల సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. మండల కేంద్రంలో ఉన్న దాదాపు 30 సిసి కెమెరాలు ఉన్నాయి. వీటి అవష్యకత అటు పోలీస్‌లకు, ఇటు ప్రజలకు ఎంతున్న వీటిని రిపేర్ చేయడంలో జాప్యం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రానున్న రెండు నెలలు శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు మరింత కీలకం అందుకు వారికీ సిసి కెమెరాలు సక్రమంగా నడవడం ఎంతైనా అవసరం. ఇప్పటికైనా పని చేయని సిసి కెమెరాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదకన రిపేర్ చేసి అనునిత్యం నిఘా ఉండేటట్లు చూస్తారని స్థానికులు ఆశిస్తున్నారు.

## ఎన్నికల ప్రచార పాటల సిడి ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాలలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎన్నికల ప్రచార పాటల సీడిని నాయకులు కార్యకర్తల సమక్షంలో ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. బయలెల్లి వస్తుండు జీవన్న పేరిట అభిమానులు రికార్డు చేసిన ఎన్నికల ప్రచార పాటల సీడిని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ చైర్మన్‌లు గిరి నాగభూషణం,విజయలక్ష్మీ, దేశాయ్, కాంగ్రెస్ నాయకులు శోభారాణి, కొత్త మోహన్, చిట్ల అంజన్న, ముస్కు ఎల్లారెడ్డి, డాక్టర్ శైలేంధర్‌రెడ్డి, చిట్ల లత తదితరులు పాల్గొన్నారు.

## నిరసన దీక్షపై జెడ్‌పి చైర్మన్‌కు నోటీసులు



**ప్రజాపక్షం/మంథని:** బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గత నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్‌పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సాగునీరు అందక ఎండిపంటలకు నష్టపరిహారం, పంట మద్దతు ధర బోనస్ అందించాలనే డిమాండ్‌తో మంథని ప్రధాన చౌరస్తాలో రైతుల పక్షాన నిరసన దీక్ష చేపట్టారు. అయితే నిరసన దీక్ష చేపట్టిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో పాటు కొంత మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ మేరకు మంథని పోలీసులు జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌కు ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు.

# ఇసుక టెండర్లు రద్దు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తాం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** శనివారం సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి గ్రామ మానేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇసుక టెండర్లలు రద్దు చేయాలని గత 8 రోజులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరాహారదీక్ష శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సందర్శించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక మాఫియా యథేచ్ఛగా కొనసాగుతున్న ప్రభుత్వం సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వ్యహరిస్తున్నారు పేద ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక తీసుకవెళ్తే అధికారులు వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తారు మరి ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా ఇసుక దోపిడి చేసేవాళ్ళపై అందుకు చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. గట్టెపల్లి మనేరులో ఇసుక లేదని ఇందులో ఇసుక తీసుకవెళ్లవద్దని ఆ గ్రామ ప్రజాలు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన ఎందుకు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే ఇసుక తీయడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయి నీళ్ల లేక పొలాలు ఎండిపోయి రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు వారి గోడు వీళ్లకు పట్టదా అని అన్నారు. ఇట్టి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వారు పట్టించుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో అన్ని పార్టీలను ప్రజలను ఐక్యం చేసి మరింత ఆందోళనలు చేపడుతామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి, సిహెచ్ ఉదయ్, రమేష్, బండారు సదానందం, మాచర్ల అంజి, రాజు, నరేష్, గ్రామ ప్రజలు, వివిధ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు చూపిన బాటలో నడవాలి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/కడం :** రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్, గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలనీ ఖానాపూర్ నియోజకవర్గ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం కడం మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్, గౌతమ బుద్ధుడని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్, బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేని అన్నారు. ఆ మహనీయుడి సిద్ధాంతాలను, ఆలోచనలను నిత్య జీవితంలో పాటించినప్పుడే అదే ఆ మహనీయునికి మనమిచ్చే బహుమానమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత, బహుజన సంఘాల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయితీల్లో సుమారు 4 నుండి 6 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శనివారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకి రెబ్బనలో ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 జులై, ఆగస్టు నెలలో కార్మికుల వేతనాలు ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేయటం జరిగిందని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో నాడు సమ్మె విరమించటం జరిగిందని తెలిపారు. కార్మికులందరికి జీవిత బీమా సౌకర్యం 5 లక్షల రూపాయలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ నేటికి అనేక జిల్లాల్లో జీవిత బీమా సౌకర్యం కల్పించకపోవటంతో బాధిత కార్మికులకు బీమా సౌకర్యం అందలేదని తెలిపారు. అదే విధంగా కార్మికులందరికి 1వ పే కమీషన్ నిర్ణయించిన మినిమమ్ బేసిక్ ప్రకారం రూ.19వేలు వేతనంగా చెల్లించాలని, జిఒ నెం.51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరిలన్నింటిని యధావిధిగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకర్, వెంకటేష్, రమేష్, దేవాజి, శంకర్, శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేయాలి



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ప్రజాపక్షం/ సుల్తానాబాద్:** సుల్తానాబాద్ పట్టణంలోని నెహ్రూ చౌరస్తా వద్ద మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు 25వ వర్ధంతి వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి స్వర్గీయ శ్రీపాదరావు చిత్రపటానికి ఎంఎల్ఎ చింతకుంట విజయ రమణారావు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభను గొప్పగా నిర్వహించడంలో తనదైన పాత్ర పోషించిన దుదిల్ల శ్రీపాదరావు మన మధ్యలో లేకపోవడం బాధకరమని, ఆయన అడుగుజాడల్లో ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దనాయక్ దామోదర్ రావు, వినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, రాజయ్య, కల్లేపల్లి జానీ, శ్రీరాములు, శివ, ముత్యాల రవీందర్, చిలుక సతీష్, అమ్మిరిశెట్టి రాజలింగం, కుమార్ కిషోర్ పలువురు పాల్గొన్నారు.

## అనుమతి లేని వెంచర్లు, కాంప్లెక్స్‌లపై చర్యలు

మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మున్సిపాలిటీలో, అనుమతి లేని వెంచర్లు, నిర్మాణంలో ఉన్న కాంప్లెక్స్‌లపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం పాలకవర్గ సభ్యులు హెచ్చరించారు. శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఈ మేరకు గతంలో చాలా మంది, మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఏడు, ఎనిమిది వార్డుల్లో అక్రమ వెంచర్లు వేసి, అనుమతి లేకుండా కాంప్లెక్స్ కట్టడంతో వర్షపు నీరు, మురికి నీరు కాలువలు పూడుకుపోయి, పట్టణంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, ఇలాంటి అక్రమార్కుల వెనుక ఇతరులు వుండి రాజకీయం చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కోడుతున్నారని ఇట్టివారిని సహించేది లేదని వారికి డిటిసిపి అనుమతి లేకుండా, ప్లాట్లు అమ్మిన కొందరు రియాల్టర్లు, ఊర్లో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ, పాలకవర్గంపై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు దీనిని నమ్మి మోసపోవద్దని వారు పేర్కొన్నారు. అక్రమమైన ప్లాట్లు, వెంచర్లు, ఇల్లు కట్టుకున్న వారికి నోటీసులు చట్టబద్ధంగా జారీ చేస్తామని చైర్మన్ సత్యం అన్నారు. ఈ సమావేశంల్లో వైస్ చైర్మన్ కావాలి సంతోష్, కౌన్సిలర్‌లు కిషోర్ నాయక్, కుర్మా శ్రీనివాస్, నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, షబ్బీర్ పాషలు ఉన్నారు.



# బిసిల హక్కులు కాలరాసిన కాంగ్రెస్ పార్టీ

జెడ్‌పి చైర్మన్ పుట్ట మధూకర్



**ప్రజాపక్షం/మంథని:** అధికారం కోసం బిసి వర్గాలకు వాడుకుని వారి హక్కులను కాంగ్రెస్ పార్టీ కాలరాస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. బిసిల ఆరాధ్యవైదం, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా మంథనిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసమంటే మహనీయుల మాసమని, ఈ మాసంలో మహనీయుల వర్ధంతి, జయంతులను జరుపుకుని వారి త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. బిసి వర్గాలకు రిజర్వేషన్‌లు ఉండాలని, రిజర్వేషన్‌లతోనే బాగుపడుతారని గొప్పగా ఆలోచన చేసిన మహనీయుడు బిపి మండల్ అన్నారు. ఆనాడు బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బిసి రిజర్వేషన్‌లకు సానుకూలంగా తీర్మాణం చేయవద్దని, అలా చేస్తే ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగిస్తామని ఇందిరా గాంధీ ఒత్తిడి తీసుకువస్తే బిసి రిజర్వేషన్‌ల కోసం ముఖ్యమంత్రి పదవిని వదులుకున్న గొప్ప మహనీయుడు బీపీ మండల్ అని వివరించారు. అయితే బిసిలను మరోమారు వాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన పేరుతో ముందుకువచ్చారని అన్నారు. బిసి కులగణన అసెంబ్లీలో తీర్మాణం చేయడం కాదని చట్టం తీసుకురావాలన్నారు. చట్టం తీసుకువస్తే బిసిలకు హక్కులు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన దాటేస్తున్నాడని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం త్యాగాలు చేసినమహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని, బిసి మండల పోరాట స్ఫూర్తిని నియోజకవర్గంలో చాటి చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తగరం శంకర్‌లాల్, కొండ రవీందర్, కనవేన శ్రీనివాస్, ముత్యాల లింగయ్య, వేల్పుల గట్టయ్య, అత్తే చంద్రమౌళి, పెగడ శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, కాయితి సమ్మయ్య, ఆరెపల్లి కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోరుట్లలో మతోన్మాదంపై సదస్సు



**ప్రజాపక్షం/కోరుట్ల:** మతోన్మాదానికి వ్యతిరేకంగా ఆదివారం జరిగే సదస్సుకు ప్రజలు భారీసంఖ్యలో హాజరు కావాలని వాయపక్ష నాయకులు పిలుపు ఇచ్చారు. కేంద్రలోని బిజెపి అనుసరిస్తేన్న ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలను ఎండగడుతూ జగిత్యాల జిల్లా కోరుట్లలోని గల సి ప్రభాకర్ భవన్‌లో 14వ తేదిన జరిగే సదస్సును నాయకులందరు పెద్ద సంఖ్యలో హాజరయ్యి విజయవంతం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకోచ్చిన బిజెపి పార్టీని పార్లమెంట్‌లో ఎన్నికల్లో ఓడించి, ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, పౌర హక్కులను కాలరాస్తున్న మతోన్మాదాన్ని ఉసిగొలుపుతున్న బిజెపి ఓడించి మతసామారస్యాన్ని కాపాడుకుందామని, భారత రాజ్యంగాన్ని రద్దుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నదని ప్రజా సమస్యల సదస్సు నిర్వహించి బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వక్తలు తెలిపారు. ఈ సదస్సుకు సిపిఎం నాయకులు ఎండీ యూసుఫ్, సిపిఐ రాష్ట్ర నాయకులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జలపతిరావు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, రాంబాబు, సమీర్, సిపిఎం నాయకులు తిరుపతినాయక్, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు చింత భూమేశ్వర్ , రమేష్ పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వడ్డీ, చీటీ వ్యాపారులతో పాటు ఏజెంట్లు ఇళ్లు, షాపుల్లో శనివారం ఉదయం నుంచి పోలీసులు సోదాలు నిర్వహించి ప్రామీసరీ నోట్లు, నాన్ జ్యూడిషల్ బాండ్స్, చెక్కులు, నగదు స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వడ్డీ, చిట్టీలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని, శనివారం నిర్వహించిన తనిఖీల్లో పట్టణానికి చెందిన సాబీర్ ఇంట్లో సోదాలు నిర్వహించగా ప్రామిసరీ నోట్స్, నాన్ జ్యాడిషల్ బాండ్స్, బ్లాంక్ చెక్స్, నగదు రూ. 3,01,500లు, తాయిబా నగర్‌కు చెందిన చిదిరాల రాజా శేఖర్ ఇంట్లో లెనోవా టి 420 మోడల్, 205 మంది అప్పుతీసుకున్న పత్రాలతో పాటు నగదు రూ. 3,78,600లు, నేషనల్ టైలర్స్ వద్ద గల సంతోష్ ఇంట్లో సంతకం లేని చెక్కులు, సంతకం గల చెక్కులు, నాన్ జ్యూడిషల్ బాండ్స్, ఖాళీ జ్యూడిషల్ బాండ్స్, బ్యాంకు పాస్ పుస్తకాలు, ప్రామిసరీ నోట్స్, ప్రామిసరీ నోట్స్ రాయనివి, ఎటిఎం కార్డ్స్, బంగారం, సెల్ ఫోన్స్, రిజిస్టర్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా అధిక వడ్డీలను అమాయక ప్రజల వద్ద నుండి వసూలు చేస్తూ, వారిని వేదిస్తుండటం వళ్ళ వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కరుణాకర్, సిఐ శంకరయ్య, ఐదు బృందాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దిపల్లిపై ఎందుకీ ఉదాసీనత

షార్ట్ ఫిలింతో సమాధానం చెబుతున్న అధికారులు

ఇసుక బినామీకి రెవెన్యూ అధికారుల అండ



**ప్రజాపక్షం/చర్ల :** పెద్దిపల్లి ఇసుక ర్యాంపుపై అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుండగా అటు గిరిజనులు తీవ్రంగా నష్ట పోతున్నారు. బినామీ కాంట్రాక్టర్‌తో చేతులు కలిపిన వివిధ శాఖల అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఇసుక క్వారీ ప్రారంభమైన నాటి నుంచి నిబంధనలు పాటించక పోవడంతో ఇప్పుడు అధికారులు సైతం పీకల్లోతు కష్టాల్లో కురుకుపోయారు. అందుకే షార్ట్ ఫిలింలకు తెర లేపారు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో గిరిజన సహకార సొసైటీ ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి నడిపాయ నుండి ట్రాక్టర్‌లు, కూలీలతో డంప్ యార్డ్ వరకు తరలించాల్సి ఉంది. ఇలా చేస్తే గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. కానీ ఇక్కడ గిరిజనుల ఉపాధి ఊసే లేదు. గోదావరి నడిపాయ నుంచి ఇష్టానుసారంగా ఇసుకను యంత్రాలతో తోడుతూ డంప్ యార్డుకు తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే షార్ట్ ఫిలిం ను ఉన్నతాధికారులకు చూపిస్తున్నారు.

**ఏమిటి షార్ట్ ఫిలిం :** తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ కు చెందిన క్షేత్రస్థాయి అధికారులు ఇసుక గుత్తేదారులు వారి బినామీలతో కలిసి నీకింత నాకింత అంటూ పంచుకుంటున్నారు. వాస్తవానికి గోదావరి నుంచి డంపింగ్ యార్డు వరకు సొసైటీ సభ్యుల చే ఇసుకను తరలించాల్సి ఉంది. కానీ అలా చేయకుండా యంత్రాలతోనే తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పుడు తెరపైకి వస్తుందేమో షార్ట్ ఫిలిం. టిఎస్ ఎండిసి అధికారులు ప్రతి ర్యాంపుకు సంబంధించి ఒక రోజు ట్రాక్టర్లు, కూలీలతో ర్యాంపులో ఫోటోలు తీస్తారు. అది కేవలం ఫోటో సెషన్ మాత్రమే. వారు కూలీలు కాదు, ఆ ట్రాక్టర్లు ఇసుక తోలేవి కాదు. ఫోటోలు తీసిన తర్వాత భద్రపరిచి ఎవరైనా గోదావరిలో యంత్రాలతో తోడుతున్నారని ఫిర్యాదు చేయగానే ఉన్నతాధికారులకు భద్రపరిచిన ఫోటోలను, వీడియోలను పంపించి పక్కదారి పట్టిస్తారు. ఉన్నతాధికారులకు కూడా గోదావరిలో ఏమి జరుగుతుందో తెలిసినా మౌనం వహించడం అలవాటుగా మారింది.

**లెక్కా పత్రం లేని తరలింపు :** ఇసుక గోదావరి నుంచి ర్యాంపుకు తరలించేటప్పుడు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది ఖచ్చితంగా అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఆ పర్యవేక్షణ కొరవడింది. పెద్దిపల్లి ర్యాంపులో గోదావరి నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారనే దానిపై అధికారుల వద్ద సమాచారం లేదు. అందుకు సంబంధించి రికార్డుల నిర్వహణ లేదు. ఈ మొత్తం బాగోతం కొత్తగూడెం టిఎస్ ఎండిసి కార్యాలయం కేంద్రంగా జరుగుతుంది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపులకు సంబంధించి గోదావరి నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను డంపింగ్ యార్డుకు తరలించారు. డంపింగ్ యార్డు నుంచి ఎంత ఇసుకను ఎగుమతి చేశారనే దానిపై లెక్కలు లేకపోవడం దీనిపై అన్ని శాఖల అధికారులు మౌనం వహించడం వెనక ఏ స్థాయిలో ఇసుకను పిండేసుకుని సొమ్ము చేసుకుంటున్నారో అవగతమవుతుంది. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు గుత్తేదారులు ఎవరి వాటా వారికి పంచేస్తున్నారు. తమ వాటా రాకపోతే ఏదో ఒక నేపం చూపెట్టి రావాల్సిన దాని కంటే కాస్త అదనంగానే పుచ్చుకుంటున్నారు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపు బినామీ కాంట్రాక్టర్‌కు స్థానిక రెవెన్యూ అధికారులు గ్రావెల్ తోలుకోవడానికి కూడా అనుమతులు ఇస్తున్నారు. సామాన్య ప్రజలు గ్రావెల్ వైపు చూస్తేనే మండిపడే చర్ల రెవెన్యూ అధికారులు బినామీ కాంట్రాక్టర్ విషయంలో మాత్రం పూర్తిగా సహకరిస్తున్నారు. ఎంఎన్‌డిసి, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల తీరు ఎలా మారిందంటే నాదస్వరం ఊదుతుంటే పాము నాట్యం చేసినట్లు బినామీ కాంట్రాక్టర్ ఏమి చెబితే అధికారులు ఆ పని చేస్తున్నారు. ఇక్కడ నిబంధనలే ఉండవు.

**పట్టించుకోని అధికారులు :** గోదావరి ఇసుక ర్యాంపులకు సంబంధించి క్షేత్ర స్థాయి అధికారుల సమాచారంపై మాత్రమే ఉన్నతాధికారుల ఆధారపడుతున్నారు. ఐటిడిఏ పిఓ కానీ, జిల్లా కలెక్టర్ కానీ ఆ ఇసుక ర్యాంపుల్లో ఏమి జరుగుతుందో కనీసం తెలుసుకునేందుకు ప్రయత్నించడం లేదు. దీనితో కోట్లాది రూపాయల ప్రకృతి సంపద అక్రమ అధికారులు, గుత్తేదారుల పరమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పెద్దిపల్లి సహా గోదావరి ఇసుక ర్యాంపులపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. గోదావరి నుంచి ఎంత ఇసుకను తరలించారు, ఎంత ఎగుమతి చేశారు అనే దానిపై పూర్తి విచారణ జరిపి కాంట్రాక్టర్లు, బినామీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## మంత్రి పొంగులేటి వాహనం తనిఖీ

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళితే తిరుమలాయపాలెం మండల పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్ నుండి బయలుదేరి మరిపెడ బంగ్లా నుండి ఖమ్మం వస్తుండగా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం స్టేజి చెక్ పోస్ట్ వద్ద పోలీసు అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాన్వాయ్‌ని ఆపి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చెయ్యగా అధికారులకు ఆయన పూర్తిగా సహకరించారు. అనంతరం వాహనాన్ని పంపించారు. చెక్‌పోస్ట్ వద్ద పలు శాఖల అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

## బోగస్ ఓట్లను ఏరివేయాలి

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుండే పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, బోగస్ ఓట్లను ఏరివేయాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ స్లిప్స్ పంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో సిసి కెమెరాల పర్యవేక్షణలో పెట్టాలన్నారు. బిజెపి నేతలకు వై కేటగిరి భద్రతను కల్పించినట్టే కాంగ్రెస్ నాయకులకు కూడా కల్పించాలన్నారు. కాంగ్రెస్ నేతలపైన వస్తున్న పలు మాటలకు ఎటువంటి అపోహలకు గురికావొద్దని ఆయన సూచించారు.

## అవకాశవాద రాజకీయాలు మానుకోవాలి

### కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి పుష్పలీల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మందకృష్ణ మాదిగ అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ నేత,మాజీ మంత్రి పుష్పలీల సూచించారు. గాంధీభవన్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మందకృష్ణ చేసేది కరెక్ట్ అని జాతి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా అని ప్రశ్నించారు. మాదిగలకు మందకృష్ణ ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ వెనకాల మాదిగలు లేరని, ఆయన ఉద్యమంలో ఉంటే తాము నెత్తిమీద పెట్టుకునే వారిమని చెప్పారు. తమకు సోషల్ స్టేటస్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కెసిఆర్‌ను ఫామ్ హౌజ్ పంపిస్తామని పంపించామని,ఇక బిజెపిని కూడా ఇంటికి పంపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన బిజెపి నేతలను తరిమి కొట్టాలన్నారు. బిజెపిలో ఎస్‌సి సెల్ నాయకులు చనిపోతే కూడా బిజెపి నాయకులు పరామర్శకు వెళ్లరని ఆరోపించారు. బిజెపి ఎస్‌సి సెల్‌కు, కాంగ్రెస్ ఎస్‌సి సెల్‌కు చాలా తేడా ఉందని పుష్పలీల అన్నారు.

## కాంగ్రెస్ పథకాలు మరచిపోయేలా సిఎం రేవంత్‌రెడ్డి చేష్టలు

### బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ ఆశన్నగారి జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పథకాలు మరచిపోయేలా సిఎం రేవంత్ రెడ్డి చేష్టలు ఉన్నాయని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌కు ధన సేకరణపైన ఉన్నంత ధ్యాస ధాన్యం సేకరణపైన లేదని చెప్పారు. రూ. 1450 కోట్ల వద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కెసిఆర్ 7,429 కొనుగోలు కేంద్రాలు పెడితే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి 5 వేల వరకు మాత్రమే పెట్టారని, దీంతో రైతులు ఆగమై పోతున్నారని ఆరోపించారు. ధన సేకరణ మీద పెట్టిన దృష్టి ధాన్యం సేకరణపైన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సిఎం రేవంత్ రెడ్డి 420 స్కీములు డిసెంబర్ 9కే ఇస్తామని చెప్పి, వాటిని మళ్లించారని ఆరోపించారు. తాజాగా మరో 25 పథకాలు ఇస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. ఎంఎస్‌పి కంటే తక్కువ ధరకు అమ్మారని, ఈ గ్లోబల్ టెండర్లు ఆంధ్రవాళ్లకు వచ్చాయని, ఈ గ్లోబల్ టెండర్లలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రుల వాటా ఎంతో చెప్పాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## కెటిఆర్ లైవ్ డిటెక్టర్ టెస్ట్‌లకు సిద్ధంగా ఉంటే ఏర్పాట్లు చేస్తాం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెటిఆర్ నిజంగానే లైవ్ డిటెక్టర్ టెస్ట్‌లకు సిద్ధంగా ఉంటే తాము ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. దీనికి సంబంధించి సమయం, ప్రాంతం చెబితే ఏర్పాటు చేస్తామన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత కెకె.మహేందర్ రెడ్డితో కలిసి ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ విషయంలో గతంలో రేవంత్ సవాలు విసిరి, గన్ పార్క్ వద్దకు వస్తే కెటిఆర్ పత్తా లేకుండా పారిపోయారని గుర్తు చేశారు. కెటిఆర్‌కు పిచ్చి ముదిరి పీక్ స్టేజ్‌కు వెళ్లిందని ఎద్దేవా చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌లో నిజాలు బయటపడుతుంటే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారన్నారు. భార్య భర్తలు, జడ్జీల ఫోన్లను కూడా కెటిఆర్ విన్నారని, తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు.తన ఫోన్ ట్యాప్ అవుతుందని ఎన్నికలకు ఎనిమిది నెలల ముందే తాను రేవంత్ దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. రేవంత్ బిజెపిలోకి వెళ్తారని కెటిఆర్ మరోసారి మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. బిజెపితో పొత్తు కోసం బిఆర్ఎస్ వెంపర్లాడింది నిజం కాదా అని ప్రశ్నించారు. కె.కె. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కెటిఆర్ అభినవ గోబెల్స్ తరహా అయ్యారని విమర్శించారు. తనను బిఆర్‌ఎస్‌లోకి రమ్మని ఇబ్బంది పెట్టారని, తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఫిర్యాదుచేయగానే కెటిఆర్‌కు పూనకం వచ్చిందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం తాను ఫిర్యాదు ఇస్తే పరువునష్టం ఎలా అవుతుందని నిలదీశారు. ఇంకా అధికారంలోనే ఉన్నానని కెటిఆర్ అనుకుంటున్నారని, కెటిఆర్ ఇచ్చిన నోటీస్ చట్టానికి విరుద్ధంగా ఉందని, ఆయన తనను బెదిరిస్తున్నట్టు ఫిర్యాదు ఇస్తానన్నారు.

## మాదిగలకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదిగ, మాదిగ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ సంఘాల ఫ్రంట్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో సిఎం రేవంత్ రెడ్డిని శనివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. మాదిగలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చినట్టు వారు తెలిపారు.

# కార్మికులందరికీ ఒకే న్యాయం

### ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి యాజమాన్యం కార్మికులందరికీ ఒకటే న్యాయం చేకూర్చాలని గుర్తింపు సంఘం ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్‌నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పైరవీకారి విధానాల వలన విసుగు చెందిన కార్మికులు మార్పు కోరుకుంటూ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఓటు వేశారని, అదే విధంగా పైరవికారీ విధానం కొనసాగితే ఎన్నికలకు అర్థం లేదని, సింగరేణి రాజకీయ జోక్యం వల్లనే నాశనమైందని, ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 4 నెలలు గడుస్తున్న యాజమాన్యం గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకుండా కేవలం వారికి అనుకూలమైన సేఫ్టీ మీటింగ్లు, సిపిఆర్ఎంఎస్ లాంటి స్టాండటరీ మీటింగ్‌కు రావాలని ఆహ్వానిస్తూ, స్టాండటరీ లేని మీటింగ్లలో మాత్రం మీకు గుర్తింపు సంఘం పత్రం రాలేదని అంటున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని తక్షణమే గుర్తింపు సంఘం పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్ కనుసన్నలలో సింగరేణి అధికారులు ఉన్నారని, మంత్రులు, ఎంఎల్‌ఎల అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. అనారోగ్యంతో ఉన్న సీనియర్ కార్మికులకు ఉపరితలంలో పనులు కల్పించాలని డిమాం డ్ చేశారు. యాజమాన్యంతో సిపిఆర్ఎంఎస్ (మెడికల్ కార్డు) ట్రస్ట్ బోర్డులో కార్మికులకు మరిన్ని జబ్బులు సేవలోకి చేర్చడానికి అంగీకరించిందని తెలిపారు. క్యాన్సర్, కిడ్నీ జబ్బులను మెడికల్ కార్డులో చేర్చాలని కోరామని, సిపిఆర్ఎం ఎస్ విలువ 8 లక్షలు దాటినప్పుడు అదనపు బిల్లు అపరిమితంగా చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు. పెన్షన్ పొందుతున్న వారిలో సుమారు 5000 మంది వారి లైవ్ సర్టిఫికెట్ అందించలేదని, వారికి అవకాశం కల్పించాలని కోరగా యాజమాన్యం అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు ఆకుల లక్ష్మ ణ్, నర్సింగరావు, సారయ్య, మురళి చౌదరి, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సింగరేణి భరోసా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సింగరేణి యజమాన్యం భరోసా కల్పించేందుకు కృషి చేసిన ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామ్యయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఘట్‌కేసర్ కొర్రెముల సుభ్రాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సింగరేణి యజమాన్యం ముందుకు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సుద్దాల లక్ష్మినారాయణ, కొట్టే మల్లయ్య, నాగేశ్వర్ రావు, ప్రకాష్ రావు, టి.శ్రీనివాస్, సుర్జిత్ సింగ్, సత్యనారాయణ, ప్రతాప్ సింగ్, మీరా ప్రసాద్, అరుణ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.






## పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు

### వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్

**ప్రజాపక్షం/నందికొండ:** వైద్య సేవల కొరకు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని వైద్య విధానం పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ వైద్యులకు వైద్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికతనికి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుందని, భోజన సదుపాయం కల్పిస్తున్నారా లేదా అంటూ రోగులను ప్రశ్నించారు.అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరై ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఎలాం టి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు. ఆయనతో పాటు ఏరియా ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ భాను ప్రసాద్ నాయక్ డాక్టర్లు, అమృత నాయక్, చక్రవర్తి, శ్రీనివాస్, వెంకయ్య స్టాఫ్ నర్సులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలను ఆహ్లాదపరిచేవిధంగా నిర్మించాలి

### నూతన చెక్‌డ్యాంలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
### మున్నేరు సిసి వాల్ నిర్మాణ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్నేరు సిసి వాల్ ప్రొటెక్షన్ నిర్మాణ పనులు ప్రజలను ఆహ్లాదపరిచేవిధంగా రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు సిసి వాల్ ప్రొటెక్షన్ నిర్మాణ పనులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులతో భేటీ అయి సమీక్షించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టు రెండు నియోజక వర్గాల ప్రజలకు సంబంధించిందని ఇరు వైపులా ప్రజలను ఆహ్లాదపరిచేవిధంగా నిర్మించాలన్నారు. వీలైతే బోటింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో వాల్ ఎత్తు పెంచుకోవడానికి వీలుగా నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. వర్షాకాలంలో ఎంత వరద వచ్చినా మురుగు కాలువల ద్వారా పట్టణంలోకి బ్యాక్ వాటర్ రాకుండా పటిష్టమైన డ్రైనేజీ సిస్టన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు మొదలైన ప్రాంతం నుండి ప్రకాష్ నగర్ కింద ప్రాంతం వరకు ఎప్పుడు నీళ్లు నిల్వ ఉండేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఖమ్మం నగరానికి తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా మున్నేరులో చెత్త పడేయకుండా వేయిలింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. వైకుంఠ ధామం దగ్గర స్నానాలు చేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట మెట్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ విషయంలో ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకు వస్తే మంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తుమ్మల నిర్మాణ సంస్థ ప్రతినిధులకు తెలిపారు.

**నేడు ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఖమ్మం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్తారు.




**ప్రజాపక్షం/హైదరాబాద్: టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో బిజెపికి చెందిన పలువురు బిజెపి నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బిజెపి మక్తల్ నాయకుడు జలంధర్ రెడ్డితో పాటు బిజెపి సంగారెడ్డి ఇన్‌చార్జ్ పులిమామిడి రాజు జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో కాంగ్రెస్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి రేవంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు.**

## నియంతృత్వ బిజెపిని గద్దెదించుదాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. శనివారం హన్మకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద రాజకీయాలు చేస్తూ ఐక్యంగా ఉన్న ప్రజలను, కార్మిక వర్గాన్ని విచ్చిన్నం చేసే కుట్రలకు బిజెపి పాల్పడుతున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతూ పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిలిచిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తూ 44 కోడ్‌లుగా ఉన్న కార్మిక చట్టలను నాలుగు కోడ్‌లుగా మార్చి యాజమాన్యాలకు, కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని సైతం మార్చి మనువాద రాజ్యాంగాన్ని తేవాలని కుట్ర చేస్తున్న బిజెపిని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక బిజెపిని లోక్‌సభ ఎన్నికలలో ఓడించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్ముల రామ్మూర్తి, నాయకులు రామ రాజేష్ ఖన్నా,కర్రె లక్ష్మ ణ్, గుంటి రాజేందర్, ఆదరి రమేష్, అనుకారి అశోక్, సదానందం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# బిజెపి గెలిస్తే ప్రమాదంలో ప్రజాస్వామ్యం

### ఓటమి భయంతోనే ఇడి, సిబిఐ దాడులు : రాఘవులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి మరోమారు అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు స్పష్టం చేశారు. దేశాన్ని ప్రమాదకర స్థాయికి బిజెపి పదేళ్ల పాలన తీసుకెళ్లిందన్నారు. మరోమారు అవకాశం కల్పిస్తే రాజ్యాంగ స్వభావం సైతం మారిపోతుందన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బివి రాఘవులు మాట్లాడుతూ బిజెపికి 370కు పైగా స్థానాలు వస్తాయని కార్పొరేట్ మీడియా ప్రచారం చేస్తుందని అంతర్జాతీయంగా కూడా బిజెపి దేశ గౌరవాన్ని పెంచిందని ప్రచారం చేయించుకుంటున్నారని కానీ ఇందులో వాస్తవం లేదన్నారు. ఓటమి భయంతో ఎన్నికల ముందు విపక్ష నాయకులను అరెస్టు చేయిస్తుందని రాఘవులు ఆరోపించారు. సిపిఎం పక్షాన లోక్‌సభ కు పోటీ చేస్తున్న కేరళ ఆర్థిక మంత్రి థామస్ హైజాక్ ఆర్‌బిఐ అనుమతితో విదేశాల నుంచి రూ. 6వేల కోట్ల మసాలా బాండ్లు సేకరించి విక్రయించారని ఈడి నోటీసులు ఇచ్చిందన్నారు. దీనిపై న్యాయ స్థానానికి వెళితే ఈడికి కోర్టు మొట్టికాయలు వేసిందని రాఘవులు తెలిపారు. కాంగ్రెస్, సిపిఎం సహా పలు పార్టీలపై జరిమానాల పేరుతో కోట్లాది రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇస్తుందని ఇదంతా బిజెపి అభద్రతా భావంతోనే చేయిస్తుందని రాఘవులు తెలిపారు. ఓట్లు, సీట్లు వచ్చేటట్లు అయితే ఇతర పార్టీల నేతలను మార్చడం ఎందుకని రాఘవులు ప్రశ్నించారు. బిజెపి ఒక వాషింగ్ మిషన్‌లా మారిందని అవినీతి పరులను చేర్చుకుని నీతి పరులుగా చేస్తుందని ఆయన తెలిపారు. వైసిపి ఎంపి శ్రీనివాసరెడ్డిని టిడిపిలో చేర్చుకుని ఎన్డిఏ కూటమి నుంచి టికెట్ ఇవ్వడం అవినీతిని సమర్ధించడం కాదా అని ఆయన ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యం బతకాలని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, వై. విక్రం, చింతల చెరువు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, సరళ, వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలనలో దళితులకు రక్షణలేదు

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం దళితులకు చేసింది శూన్యం. బిజెపి పాలనలో దళితులకు రక్షణ లేదు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కొరకు దళిత జాతి చైతన్యవంతం కావాలి అని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) శుక్రవారం రోజున యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామంలో దళితవాడలో పల్లెనిద్రలో భాగంగా దళిత వాడలో డప్పులతో కాలనీలో ఊరేగింపు నిర్వహించి కూడలి వద్ద సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ బిజెపి మోడీ నేతృత్వంలో అధికారంలోకి వచ్చాక దేశంలో మత సామరస్యం తీవ్రంగా దెబ్బతింది. దళితుల పైన దాడులు పెరిగిగాయి, లౌకిక దేశాన్ని హిందూ రాజ్యాంగ మార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతుందని, దళితులపై దాడులకు అంతే లేదన్నారు. అంతేగాక మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నిటిని తన గుప్పట్లోకి తీసుకుందని, స్వతంత్ర న్యాయవ్యవస్థ అస్తిత్వం కూడా ప్రమాదంలో పడిందని, ఆర్ఎస్ఎస్ కన్నుసన్నుల్లోని బిజెపి పదేండ్ల పరిపాలనలో దేశం సరిహద్దు ఉద్రిక్తతలు, దేశంలోపల మత విద్వేషాలు, గ్రామాల్లో కుల ఘర్షణలు మినహా బిజెపి దేశ ప్రజలకు చేసింది ఈసమంతా మేలు జరగలేదన్నారు. పైగా దేశ ప్రజలందరి గుండెకాయ లాంటి భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి పూనుకుందన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ఒక పథకం ప్రకారంగా సకల ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా మళ్ళీ అధికారులకు రావాలని చూస్తున్నా బిజెపిని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దళితులు ఓడించాలని ఆయన అన్నారు.ఆర్టికల్ 370, సిఏఏ, ట్రిపుల్ తలాక్, యూనిఫామ్ సివిల్ కోడ్ లాంటి అనైతిక చర్యలు లౌకిక భారత అస్తిత్వానికే ప్రమాదం. ఒక్క నీటిపారుదల ప్రాజెక్టు లేదు, విద్య , వైద్య రంగాల్ని మెరుగుపరిచిన దాఖలాలు ఎక్కడా లేవు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాస్, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాశపాక దయాకర్, ఎర్రోళ్ల లింగ స్వామి, సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కల్లపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు ఇంజ హేమలత, భాగ్యమ్మ, బోదాసు స్వామి, గడ్డం లక్ష్మ య్య, అధిక సంఖ్యలో పాల్గొన్న మర్రిగూడ గ్రామస్తులు తదితరుల పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు

### తుంగతుర్తి ఎంఎల్‌ఎ సామేల్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** వ్యవసాయ మార్కెట్, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో భారీగా ధాన్యం రావడంతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా మార్కెట్‌కు సెలవు ఉండడంతో శనివార సుమారు 60వేల బస్తాలకు పైగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు మార్కెట్‌కు 2వేల బస్తాలకు పైగా టోకెన్లు ఇవ్వాలని సంబంధి అధికారులను సూచించారు. రైతుల పట్ల ఇష్టానుసారంగా కమీషన్లు వేసి ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాగంటి అనసూయ రాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచే ఓటుహక్కుపై విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు తమ ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే విధానం పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు కోరారు. ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తదుపరి ఇంటి వద్ద నుండే ఓటింగ్‌కు దరఖాస్తు చేసు కోవచ్చని, దీనికి సంబంధించి 12 డి ఫారం పూర్తి చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి నుండి ఓటు వేసే విధానాన్ని వికలాంగులు, 85ఏళ్ల పైబడిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com